# రిమాండ్ ఖైదీ మృతి!

## -న్యాయం చేయాలని కుటుంబసభ్యుల డిమాండ్




తిరుపతి, ఆగస్టు 3 ప్రభాతవార్త: తిరుపతిసబ్‌జైల్‌లో రిమాండ్‌లో ఉన్న ఖైదీ వై.ఇంద్రసేనయ్య(56)మృతి చెందాడు. ఆయన మృతిపై విచారణ చేయాలని, జైల్లో చనిపోయిన అతని కుటుంబసభ్యులకు న్యాయంచేయాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. పుత్తూరుమండలం టిఆర్ కండ్రిగ కాలనీకిచెందిన ఇంద్రసేన కరోనా లాక్‌డౌన్ సమయంలో ఇంట్లో నాటుసారా విక్రయిస్తున్నాడన్న అనుమానంతో ఎక్సైజ్ పోలీసులు తనిఖీ చేశారు. లీటరుసారా పట్టుబడింది.దీనిపై కేసు నమోదు చేశారు. తిరుపతి సబ్‌జైల్లో వున్న అతను మృతిపై కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త






## సూళ్లూరుపేట మున్సిపల్ కార్యాలయంపై

# ఏసీబీ దాడులు

## - రూ.1.93 లక్షల నగదు స్వాధీనం



కారులో తనిఖీలు చేస్తున్న దృశ్యం



కార్యాలయంలో సిబ్బందిని ప్రశ్నిస్తున్న దృశ్యం

సూళ్లూరుపేట, ఆగస్టు 3 ప్రభాతవార్త సూళ్లూరుపేట మున్సిపల్ కార్యాలయంపై నెల్లూరు జిల్లా ఏసీబీ డీఎస్పీ జిఆర్ఆర్ కుమార్ ఆధ్వర్యంలో ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. బుధవారం ఉదయం కార్యాలయంలో పనులు ప్రారంభమైన అనంతరం 11 గంటలకు ఏసీబీ అధికారుల బృందం కార్యాలయాన్ని చుట్టుముట్టారు. కార్యాలయంలోని సిబ్బందిని వెలుపలికి రాకుండా తలుపులు మూసేసి క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. కార్యాలయంలోకి వచ్చిన ప్రజలను సైతం కొద్దిసేపు ఆగాలంటూ నిలిపేశారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు రావడం చూసి ఆందోళనకు గురైన కమిషనర్ నరేంద్ర తన వద్ద ఉన్న నగదును కిటికీ గుండా బయటకు విసిరేశారు. ఇది గమనించిన అధికారులు ఆ నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే కార్యాలయం వెలుపల ఉన్న కమిషనర్ కారును తనిఖీ చేసి అందులోని రూ.50 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. దీంతో మొత్తం ఒక లక్షా 93 వేల రూపాయల నగదు ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లయింది. స్పందన యాప్‌కు మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై, ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్, బిల్డింగ్ విభాగంలో జరుగుతున్న తతంగంపై భారీ స్థాయిలో ఫిర్యాదులు అందడంతో ఏసీబీ అధికారులు స్పందించి ఈ దాడులు నిర్వహించినట్లు తెలిసింది. కార్యాలయంలోని రికార్డులతో పాటు పన్నుల నగదు కౌంటర్‌లో ఉన్న డబ్బులను అధికారులు లెక్కలు చూశారు. కార్యాలయంలోని కంప్యూటర్లలో సమాచారాన్ని తీసే పనిలో ఏసీబీ అధికారులు నిమగ్నమయ్యారు. కార్యాలయంలో దాడులు జరుగుతున్నాయన్న సమాచారం అందడంతో మిగతా కార్యాలయాల్లోని సిబ్బంది అప్రమత్తం అయ్యారు. మొత్తంమీద ఏసీబీ దాడులు జరుగుతున్నాయన్న సమాచారం పట్టణంలో హాట్ టాపిక్‌గా మారింది. మరోవైపు రాజకీయ కోణంలోనే ఈ దాడులు జరిగాయన్న ప్రచారం బాగా జరుగుతోంది. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు వేణు, జీఎల్ శ్రీనివాస్, కిరణ్, రమేష్‌బాబులు పాల్గొన్నారు.

# కుప్పంపై సిఎం జ'గన్' గురి ..

## అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే టార్గెట్ !!
## నేడు కుప్పం కార్యకర్తలతో సమావేశం..
## భవిష్యత్తు కార్యాచరణపై దిశానిర్దేశం !!



కుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త ప్రతిపక్షనేత, మాజీ సిఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం అసెంబ్లీ స్థానంపై ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జ'గన్' మోహన్‌రెడ్డి గురిపెట్టారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా 175 సీట్లలో గెలుపు సాధించడమే ధ్యేయంగా పెట్టుకున్న ముఖ్యమంత్రి అందులో భాగంగా కుప్పం నియోజకవర్గంలో గెలుపే తమ టార్గెట్‌గా నిర్ణయించుకున్నారు. పార్టీ అధికారంలో వచ్చిన మూడేళ్ల అనంతరం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కార్యకర్తలతో తన మనోభావాలు పంచుకునేందుకు శ్రీకారం చుట్టారు. అందులో తొలి అవకాశం కుప్పం నియోజకవర్గ వైకాపా కార్యకర్తలకే కల్పించడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. నియోజకవర్గంలో ఉన్న సుమారు యాభైమంది కార్యకర్తలు ఇప్పటికే విజయవాడకు బయలుదేరారని తెలిసింది. సిఎం నిర్వహించే కార్యకర్తల సమీక్షకు చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్ పాల్గొంటారని సమాచారం. తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్న కుప్పం నియోజకవర్గంలో 2021లో అధికార వైఎస్సార్సీ హ్యాట్రిక్ విజయాలు సొంతం చేసుకుని సంచలనం కలిగించింది. తొలుత గతేడాది ఫిబ్రవరిలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో 89 పంచాయతీలకు గాను 75 సర్పంచ్ స్థానాలు దక్కించుకుంది. అనంతరం ఎంపిపి, జడ్పిటిసి ఎన్నికల్లో నాలుగు మండలాల్లో క్లీన్ స్వీప్ చేసింది. ఇక కుప్పం నడిగడ్డపై కీలకపోరుగా కుప్పం మున్సిపాలిటీ తొలి ఎన్నికలు ఇరు పార్టీలకు ప్రతిష్టగా మారాయి. అయితే ఈ ఎన్నికల్లో సైతం వైకాపా 25 వార్డులకు గాను 19 వార్డులు చేజిక్కించుకుని విజయఢంకా మోగించింది. ఈ ఎన్నికల్లో గెలుపుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపిలు మిధున్‌రెడ్డి, రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్‌లు విశేష కృషి చేశారు. ఈ విజయం సిఎంలో కొత్త ఉత్సాహం తెచ్చిందనే చెప్పాలి. ఇటీవల జరిగిన పార్టీ ముఖ్యనేతల సమావేశంలో సైతం సిఎం కుప్పంలో మున్సిపాలిటీని గెలిచాం, అసెంబ్లీ ఎన్నికల్లో ఎందుకు గెలవలేము అని పేర్కొన్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి టార్గెట్‌గా పెట్టుకున్న కుప్పం నియోజకవర్గం తొలిస్థానంలోనే ఉందనేది స్పష్టమవుతోంది. కుప్పం మున్సిపల్ ఎన్నికల ఫలితాలకు ముందే ఇచ్చిన మాట మేరకు ఎమ్మెల్సీ పదవిని కుప్పం ఇన్‌చార్జ్‌గా ఉన్న భరత్‌కు ముఖ్యమంత్రి అప్పగించారు. అనంతరం ఏకంగా భరత్‌ను జిల్లా వైకాపా అధ్యక్షుడిగా నియమించారు. ఎమ్మెల్సీ భరత్ కూడా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులతో కుప్పంలో పార్టీ బలోపేతంకు తనవంతు శాయశక్తులా కృషి చేస్తున్నారు. మరి 2024లో కుప్పంలో గెలుపుకోసం సిఎం ఎలాంటి 'జగన్మోహనమంత్రం'ను కార్యకర్తలకు ఉపదేశిస్తారో వేచి చూడాల్సి ఉంది.

# ఉత్సవాలకు మంత్రి, కలెక్టర్‌లకు ఆహ్వానం





ఉత్సవాల ఆహ్వాన పత్రికను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, కలెక్టర్‌కు అందజేస్తున్న ఛైర్మన్, ఈఓలు.

కాణిపాకం, ఆగస్టు 3 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో జరగనున్న ఆలయ మహాకుంభాభిషేకం, స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు దేవస్థానం తరపున పలువురు ప్రముఖులకు బుధవారం ఆహ్వాన పత్రికలను అందజేశారు. సుమారు 10 కోట్ల రూపాయల వ్యయ అంచనాలతో నూతనంగా నిర్మించిన ప్రధాన ఆలయం మహా కుంభాభిషేకం ఈనెల 21న వైభవంగా జరగనుంది. అలాగే ఈనెల 31 నుండి వచ్చేనెల 20 వరకు ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఈమేరకు రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని మంత్రి స్వగృహంలో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు, ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఎంవి.సురేష్‌బాబులు కలసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, బాలాజినాయుడు, ఆలయ అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

## తిరుమలేశుని పవిత్రోత్సవాలకు

# 7న అంకురార్పణ



తిరుమల, ఆగస్టు 3ప్రభాతవార్తప్రతినిధి: దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగే వైదిక కార్యక్రమాలలో యాత్రికులు, సిబ్బంది వల్ల తెలిసీతెలియక చేసిన దోషాల నివృత్తికి చేపట్టే పవిత్రోత్సవాలు ఈనెల 8వతేదీ నుంచి 10వరకు మూడురోజులు నిర్వహించనున్నారు. ఈ పవిత్రోత్సవాలకు 7వతేదీ ఆదివారం అంకురార్పణతో మొదలవుతాయి. 8వతేదీ సోమవారం ఉదయం నుంచి ఆలయంలోని సంపంగిప్రాకారంలో విశేష కైంకర్యాలు, పూజలు శ్రీదేవిభూదేవిసమేత శ్రీమలయప్పస్వామివారికి నిర్వహిస్తారు. సాధారణంగా ప్రతి ఏడాది ఈ పవిత్రోత్సవాలను ఆలయంలో శాస్త్రోక్తంగా అర్చకులు జరిపిస్తారు. ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. తొలిరోజు 8వతేదీ ఉదయం 9నుంచి 11గంటల వరకు ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ఆభరణాలతో శ్రీదేవిభూదేవిసమేత శ్రీమలయప్పస్వామి ఆలయ మాఢవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. 8న పవిత్రాల ప్రతిష్ట, 9న పవిత్ర సమర్పణ, 10న పూర్ణాహుతి కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ సందర్భంగా ఆలయంలో మూడురోజులు ఆర్జితసేవలను టిటిడి రద్దుచేసింది. ఆగస్టు 9న అష్టదళపాదపద్మారాధన, ఇక 8నుంచి 10వతేదీ వరకు మూడురోజులు వరుసగా స్వామివారికి జరిగే కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలు రద్దయ్యాయి. ఈ ఉత్సవాల్లో పాల్గోనేందుకు భక్తులకు ఆన్‌లైన్‌లో 600టిక్కెట్లు విడుదల చేశారు.

## షార్‌లో మొదలైన

# రాకెట్ ప్రయోగ సందడి

## - వెలుగులు విరజిమ్ముతున్న వీక్షకుల గ్యాలరీ
## - పదివేల మంది వస్తారని అంచనా



వెలుగులు విరజిమ్ముతున్న వీక్షకుల గ్యాలరీ





శ్రీహరికోట (తడ), ఆగస్టు 3 ప్రభాతవార్త శ్రీహరికోటలో ఈ నెల 7న జరగనున్న స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ రాకెట్ ప్రయోగానికి సందడి మొదలైంది. 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవ ఫలితాలను అంతరిక్షంలో కూడా ఒక ఉపగ్రహం రూపంలో ప్రవేశపెడుతున్న శాస్త్రవేత్తలు ఈ సారి సందర్శకులకు అవకాశం ఇస్తున్నారు. వీక్షకుల గ్యాలరీ ముస్తాబవుతోంది. 8 వేల మంది వీక్షకులకు ఆన్‌లైన్‌లో ఆహ్వానం అందగా, మరో రెండువేల మంది అదనంగా వస్తారని అంచనా వేస్తున్నారు. ఉదయం పూట ప్రయోగం కావడం వల్ల ఇబ్బంది లేకుండా దగ్గరగా రాకెట్ గమనాన్ని తిలకించే అవకాశం ఉంది. ఎస్ఎస్ఎల్‌వీ సిరీస్‌లో తొలి ప్రయోగం ఈ నెల 7న ఉదయం 9.18 గంటలకు జరగనుండగా,

## ఏపీపీజీఈ సెట్ - 2022 పరీక్ష ఫలితాలు విడుదల



తిరుపతి (క్రీడా), ఆగస్టు 3, ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి తరపున శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో జూలై 18, 19, 20 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఏపీపీజీఈసెట్ 2022 పరీక్ష ఫలితాలను బుధవారం వర్సిటీ ఉప కులపతి, ఏపీపీజీఈసెట్ ఛైర్మన్ ఆచార్య కె. రాజారెడ్డి తన కార్యాలయంలో విడుదల చేసారు. ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలో 85.73 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5703 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 4598 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. వీరిలో 3942 మంది అభ్యర్థులు ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. బయోటెక్నాలజీలో ఎ. శివరామ ప్రసాద్, కెమికల్ ఇంజినీరింగ్‌లో బిడి మనోరమ్య, సివిల్ ఇంజినీరింగ్‌లో ఎస్. సత్యసాయి, కృష్ణభాను, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్‌లో పి. జ్యోతి స్వరూప్, ఫుడ్ టెక్నాలజీలో కె. దివ్య, జియో ఇంజినీరింగ్ అండ్ జియో ఇన్ఫర్మ్యాటిక్స్‌లో పి. జయశ్రీ, ఇనుస్ట్రుమెంటేషన్‌లో ఆర్. లిఖిత, మెటల్లుర్జిలో ఎస్. అస్మ, నానో టెక్నాలజీలో యూ. సత్య సాయి తేజస్వీ, ఫార్మసీలో బి. పవన్ మొదటి ర్యాంకు సాధించినట్లు వివరించారు. ఈ ఫలితాలను ఉన్నత విద్యా మండలి వెబ్‌సైట్ నందు పొందుపరిచినట్లు వెల్లడించారు. విద్యార్థులు ఈ వెబ్‌సైట్ నుంచి తమ ర్యాంకు కార్డులను పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్, ఏపీపీజీఈ సెట్ కన్వీనర్ ఆచార్య ఆర్‌విఎస్ సత్యనారాయణ, సభ్యులు ఆచార్య శ్రీనివాసులు, ఆచార్య దివాకర్ రెడ్డి, మీడియా కోఆర్డినేటర్స్ ఆచార్య కుసుమ హరినాథ్, డాక్టర్ పిసి వెంకటేశ్వర్లు, ఏపీపీజీఈ సెట్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో జరుగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను అందిస్తున్న దృశ్యం

# భారీ వర్షంతో నేలకొరిగిన వరి

## పాములకాల్వ తీరంలో తడ రైతుకు తీవ్ర నష్టం



తడ, ఆగస్టు 3 ప్రభాతవార్త తడ మండలంలో గత రెండురోజులుగా కురిసిన భారీవర్షంతో వరి పైరు నేలకొరిగింది. మండల పరిధిలోని వెండ్లూరుపాడు తదితర గ్రామాల్లో ఎడగారు వరి పైరును వేసుకున్నారు. అదేం చిత్రమో గాని గత రెండురోజులుగా ఆ ప్రాంతంలోనే భారీ వర్షాలు కురిశాయి. మండలంలోని ఇతర ప్రాంతాల్లో కన్నా పాములకాల్వ సమీప గ్రామాలలో వర్షం ఎక్కువగా కురవడంతో రైతులు నష్టపోయారు. 1010 రకం ఎడగారు పైరును సుమారు 600 ఎకరాల్లో రైతులు నాటుకోగా, కొత్త రకం పైరు మరో 100 ఎకరాల్లో నాటుకున్నారు. తొందరగా కోతకు వస్తుందని రైతులు భావిస్తే వరి కోతకు ముందుగా వరుణుడు వచ్చేశాడు. ఈ ప్రాంతంలో ఆగస్టు నెలలో వర్షాలు అరుదుగా కురుస్తుంటాయి. ఈ సారి అందుకు భిన్నంగా భారీవర్షం కురవడంతో ఎన్ను తీసిన వరి పంట మొత్తం నేల మీద పడిపోయింది. ఆ పైరు పై భాగంలో నీళ్ల నిలవడంతో మొలకలు వచ్చే ప్రమాదం ఏర్పడిందని రైతన్నలు బావురుమంటున్నారు. తడ మండలంలో పుష్కలంగా వరి పంట పండే పాముల కాలువ సమీప గ్రామాల్లో ప్రస్తుతం అందరి కన్నా ఎక్కువగా సంతోషించే రోజులు పోయి పంట దెబ్బతినడంతో విషాదంలో రైతులు మునిగిపోయారు. విత్తనాల దగ్గర నుంచి మందులు, పురుగు మందులు, కూలీల ధరలు పెరిగిపోయిన నేపథ్యంలో తమకు నష్టం అపారంగా ఉంటుందని పలువురు రైతులు తెలిపారు. ప్రస్తుతం వెండ్లూరుపాడుతో పాటు పొన్నపాడు, గోనుగుంట, గుర్రాలమిట్ట, దండుబాడు, కట్టవ, చినమాంబట్టు, కాదలూరు తదితర గ్రామాల్లో ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం పంట నష్టాన్ని గుర్తించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# చిరు వ్యాపారులకు జగనన్న తోడు

## జిల్లాలో 23,603 మందికి లబ్ది - డీఆర్‌వో శ్రీనివాసరావు వెల్లడి



తిరుపతి కలెక్టరేట్, జూలై 3 ప్రభాతవార్త ః ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిరు వ్యాపారులకు జగన్న తోడు ఐదవ విడత జిల్లాల్లోని 23,603 మంది లబ్దిదారులకు ఒక్కొక్కరికి రూ. 10వేలు వంతు లబ్దిదారుల ఖాతాల్లోకి జమ చేశారని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు (డీఆర్వో) వెల్లడించారు. బుధవారం సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాడే పల్లి క్యాంపు కార్యాలయం నుంచి జగనన్న తోడు లబ్దిదారులకు జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించగా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా రెవెన్యూ అధికారి, సంబంధిత అధికారులు, లబ్దిదారులు హాజరయ్యారు, సీఎం జగనన్న తోడు లబ్దిదారులకు కంప్యూటర్ బటన్ నొక్కి జమ చేసిన అనంతరం డీఆర్వో శ్రీనివాసరావు లబ్దిదారులనుద్దేశించి మాట్లాడారు. చిరు వ్యాపారస్తులు సాంప్రదాయ వృత్తి కళాకారులు, ప్రైవేట్ వ్యక్తుల, వడ్డీ వ్యాపారస్తుల దగ్గర రుణం ఆశ్రయించకుండా గత రెండు సంవత్సరాల నుంచి జగనన్న తోడు అందిస్తున్నారన్నారు. నేడు జిల్లాలో 23,603 మంది కుటుంబాలకు రూ. 10వేలు వంతున జమ అవుతుందని తెలిపారు. అలాగే గతంలో రుణం పొం దిన 47,179మంది జగనన్న తోడు రుణం తిరిగి చెల్లించిన లబ్దిదారులకు గత మే మాసం వరకు వడ్డీగా రూ. 78,47,730లు కూడా నేడు జమ కానుందని తెలిపారు. జగనన్న తోడు మెగా చెక్కు రూ. 23,60, 30.000లు, అలాగే వడ్డీ రూ. 78,47,730లు చెక్కును లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీ మెప్మారాధమ్మ,డీఆర్‌డీఏ ప్రభావతమ్మ,మేనేజర్ పట్టాభిరెడ్డి,డీఐపీఆర్వో బాలకొండయ్య, అధికారుల పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులకు జగనన్న ప్రభుత్వం అండ

## జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు



జగనన్న తోడు మెగా చెక్కును లబ్దిదారులకు అందజేస్తున్న జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు తదితరులు

చిత్తూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త: చిరు వ్యాపారులు, సాంప్రదాయ చేతి వృత్తుల వారికి జగనన్న ప్రభుత్వం తోడుగా నిలిచి ఆర్థిక సహాయం అందిస్తోందని దీనిని సద్వినియోగం చేసుకొని వారు మరింత పురోగతి సాధించాలని జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పేర్కొన్నారు. తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుండి బుధవారం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో చిరు వ్యాపారులకు తోడుగా నిలబడాలనే ఉద్దేశంతో 5వ విడత జగనన్న తోడు లబ్దిదారుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేసే కార్యక్రమంను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, రాష్ట్ర విదేశీ వ్యవహారాల సలహాదారు, మాజీ ఎంపి జ్ఞానేంద్రరెడ్డి, కలెక్టర్ హరినారాయణన్, మేయర్ అముద, మాజీ ఎమ్మెల్యే గాంధీ, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, ఇతర అధికారులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాల సంక్షేమానికి పలు పథకాలు శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నారన్నారు. జగనన్న తోడు పథకం కింద ఈ ఏడాది చిరువ్యాపారులకు 395 కోట్ల రుణంతో కలిపి ఇప్పటి వరకు 15.03 లక్షల మంది లబ్దిదారులకు 2,011 కోట్ల వడ్డీ లేని రుణం అందించారన్నారు. జిల్లాలో 17,933 మందికి ఈ పథకం ద్వారా లబ్ది చేకూర్చడం జరిగిందన్నారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ చిరు వ్యాపారులు వ్యాపారం కోసం ఇతరుల వద్ద అధిక వడ్డీలకు రుణం తీసుకోని విధంగా జగనన్న తోడు కార్యక్రమం ద్వారా తక్కువ వడ్డీతో చిరు వ్యాపారులకు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రుణం అందిస్తున్నారన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమం ద్వారా 13,093 మంది గ్రామీణ, 4,850 మంది పట్టణ ప్రాంతాల్లో చిరు వ్యాపారులు లబ్ది పొందుతున్నారన్నారు. అనంతరం జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ హరినారాయణన్, రాష్ట్ర విదేశీ వ్యవహారాల సలహాదారులు, మాజీ ఎంపి జ్ఞానేంద్రరెడ్డిలు జగనన్న తోడు లబ్దిదారులకు మెగా చెక్కును పంపిణీ చేశారు.

# ప్రజలతో మమేకమే..గడప గడప లక్ష్యం..ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం, ఆగష్టు 3, ప్రభాతవార్త :
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మూడేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ పథకాల లబ్ధిదారులను కలిసేలా రూపొందించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలోభాగంగాబుధవారం మండలంలోని గంగవరం,శ్రీలంక కాలనీల లో పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతోమమేకమయ్యేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి గడప గడపకు వెళ్లి వారి



ఆశీర్వాదం తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. అంతకు ముందు గంగవ రంలో రూ. 21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.19 లక్షల వ్యయంతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. అలాగే మండలానికి నూతనంగా మం జూరైన 438 పించన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు,ఎంపిపి వెంకటరమణ, సర్పంచ్ చంద్రమ్మ, ఎంపిటిసిలు లేఖ్యాబాలు, కేశవులు,శ్రీధర్,వరలక్ష్మి, ఉప సర్పంచ్ మంజునాథరెడ్డి పలమనేరు సింగిల్‌విండో అధ్యక్షుడు రఘుపతి, నాయకులు ఏటిగడ్డ శ్రీరాములు రెడ్డి,పట్టాభి, అనిల్,ఆనంద్, బాబు, రమణ, ఉదయ్, విజయ్,బోస్, వేలు,మహేష్,రమేష్‌రెడ్డి,తహశీల్దారుమురళీ, ఎంపిడిఓ శివప్రసాద్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

పలమనేరు, ఆగస్టు 3 ప్రభాతవార్త:



జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక కోర్టులో ప్రీ సిటింగ్‌లో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు,జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లోక్ అదాలత్‌కు సంబందించి ప్రీ సిటింగ్ నిర్వహించి కక్షిదారులు వారి వకీలు, పోలీసు సిబ్బంది ద్వారా వారి వాజ్య ములను కోర్టు సిబ్బందికి తెలియచెప్పిన ఆ వాజ్యలు పరిష్కరించుకోగలరని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షులు లక్ష్మీపతి,కార్యదర్శి బర్కత్,ఎల్.భాస్కర్,లక్ష్మణ్,ఏజిపి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బాబు వ్యాఖ్యలను ఖండించిన టిడిపి

పలమనేరు,ఆగస్టు 3,ప్రభాతవార్త:
ఇటీవల పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్ బాబు టిడిపిపై చేసిన వ్యాఖ్యలను స్థానిక టిడిపి నాయకులు ఖండించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాయకులు గ్యాస్ నాగరాజు,గిరిబాబు మాట్లాడుతూ పూతలపట్టులో ఒక్క అభివృద్ధి చేయని ఎమ్మెల్యే ఎం.ఎస్ బాబు టిడిపిని విమర్శించడం సరికాదని తెలిపారు. అక్రమ ఇసుక,క్వారీలు,దందాలు చేస్తున్న ఆయన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,మాజీ మంత్రి నారా లోకేష్‌లను అసభ్యంగా మాట్లాడడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మదన్‌మోహన్,చిన్ని,సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు చర్యలు

పలమనేరు,ఆగస్టు 3,ప్రభాతవార్త:
పట్టణంలోని పలు వార్డులలో దోమ ల నివారణపై మలేరియా సబ్ యూ నిట్ అధికారి జయశంకర్ ఆధ్వర్యం లో అవగాహన కార్యక్రమాన్ని బుధావారం నిర్వహించారు. పట్టణం లోని రాజీవ్ గాంధీ నగర్, సూరప్పవీధి,పాతపేటలోని పలు ప్రాంతాలలో ఆయన లార్వా వృద్ధిని నివారణకు చర్యలు తీసుకోవడం జరిగింది. ఇంటి పరిసర ప్రాంతాలో నీటి నిల్వల ద్వారా దోమ లార్వా వృద్ధి చెందుతుందని వాటి నివారణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సుజాత,కృష్ణవేణి, సురేష్,రమేష్,నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## కాకాని వెంకటర్నతం జయంతి వేడుకలు

పెనుమూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త:



పెనుమూరు సచివాలయంలో బుధవారం స్వాతంత్ర్య సమర యోధుడు కాకాని వెంకటర్నం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటంకు అధికారులు, నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రవికుమార్, ఎంపిటిసీ దొరస్వామి యాదవ్, వైకాపా నాయకులు గోవిందరెడ్డి, చక్రవర్తినాయుడు, జతీశ్వర్‌నాయుడు, వార్డు సభ్యులు మురాద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## మాటపై నిలబడే వ్యక్తి సిఎం జగన్

శాంతిపురం, ఆగస్టు 3 ప్రభాతవార్త



ప్రజలకు మాటిస్తే ఎన్నికష్టనష్టాలు వచ్చినా మాట నిలుపుకునే వ్యక్తి సిఎం జగన్మోహన్‌రెడ్డి అని జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, రాష్ట్ర వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ పెద్దన్న పేర్కొన్నారు. మండలంలోని మఠంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఇతర పార్టీల నేతలు పనిగట్టుకుని సిఎంను విమర్శించడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు అమలు చేస్తున్నారన్నారు. ఓటిఎస్ ద్వారా 87మందికి రిజిస్ట్రేషన్ పత్రాలు అందించారు. ప్రైమరీ పాఠశాలలో జగనన్న విద్యాకానుక పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మురళి, కార్యదర్శి శ్రీనివాసులు, నేతలు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య పోరాటంలో కాకాని వెంకటరత్నం పాత్ర కీలకం

– జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు

చిత్తూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త:



స్వాతంత్ర్య సమరంలో కాకాని వెంకటరత్నం పాత్ర కీలకమని జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పేర్కొన్నారు. జిల్లా సచివాలయం గ్రీవెన్స్ హాలులో బుధవారం కాకాని వెంకటరత్నం జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ హరినారాయణన్, డిఆర్ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, డిఆర్‌డిఏ పిడి డిఎంకె తులసీ తదితరులు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం పని చేసిన స్వాతంత్ర్య సమర యోధుల జీవితాలు అందరికీ ఆదర్శం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## వేరుసెనగ పంటపై పొలంబడి

బంగారుపాళ్యం, ఆగస్టు 3 ప్రభాతవార్త:
మండలంలోని మహాసముద్రం రైతు భరోసా కేంద్ర పరిధిలో సాగు చేస్తున్న వేరుసెనగ పంటలో పొలంబడి కార్యక్రమంను వ్యవసాయశాఖ అధికారం బుధవారం పొలంబడి కార్యక్రమం చేపట్టారు. జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని క్షేత్ర స్థాయిలో వేరుసెనగ పంట పొలంబడి చేపట్టారు. వేరుసెగన పంటకు ఆశించే తెగుళ్ళు నివారణకు చేపట్టాల్సిన చర్యలు, దీర్ఘ, స్వల్పకాలిక ప్రయోగాల గురించి ఆర్‌బికె సిబ్బంది, రైతులకు ఆమె వివరించారు. ఏఓ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పల్లెల్లో పారిశుధ్యమే కీలకం – ఎంపిపి ప్రసాద్‌రెడ్డి

గుడిపాల, ఆగస్టు 3 ప్రభాతవార్త:
ఆరోగ్య సమాజ ఆవిష్కరణకు పల్లెల్లో పారిశుధ్యం కీలకమని ఎంపిపి ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో బుధవారం ఎంపిపి ప్రసాద్‌రెడ్డి పల్లెల్లో చెత్త సేకరణ నిమిత్తం ప్రభుత్వం అందించిన చెత్త సేకరణ వాహనాలను ఆయన గ్రామాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రజలు గ్రామాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని కోరారు. ఈ కర్యక్రమంలో ఎంపిడిఓ ఉపేంద్ర, సర్పంచ్ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మాటతీరు మార్చుకోవాలి



బంగారుపాళ్యం, ఆగస్టు 3 ప్రభాతవార్త:
పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తన మాట తీరు మార్చుకోవాలని మండల టిడిపి నాయకులు హితవు పలికారు. స్థానిక మండల టిడిపి కార్యాలయంలో బుధవారం టిడిపి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ 14 సంవత్సరాలు సిఎంగా పరిపాలన సాగించిన చంద్రబాబునాయుడు, అతని కుమారుడు నారా లోకేష్‌పై ఎమ్మెల్యే ఎం ఎస్ బాబు అనుచిత వా ఖ్యలు చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే స్థాయికి అలాంటి మాట్లాడటం సబబు కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కార్యదర్శి జనార్ధన్‌గౌడు, ఉపాధ్యక్షుడు కమలనాధరెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు రమేష్, అధికార ప్రతినిధి మంజునాథ్, నియోజకవర్గ మహిళా కార్యదర్శి దేవయాని, చిట్టెమ్మ, అరవిందబాబు, శివ, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త
33కెవి విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా గురువారం ఉదయం 10గంటలనుంచి సాయంత్రం 4గంటల దాకా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రెస్కో ఎడిఇ ప్రభాకర్ తెలిపారు. మల్లానూరు,అడవిబూదుగూరు,నూలుకుంట, కంగుంది,గుత్తార్లపల్లి,దాసిమానిపల్లి,కుప్పం సబ్‌స్టేషన్, చీగలపల్లి ఫీడరులో విద్యుత్ అంత రాయం

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## దేశ భక్తి గీతాలు రచించిన కవుల చిత్రలేఖన ప్రదర్శన

చిత్తూరురూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త:
నగరంలోని శ్రీమతి ఎన్‌పి సావిత్రమ్మ మహిళా కళాశాలలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌ను పురస్కరించుకొని తెలుగు, హిందీ విభాగాలు సంయుక్తంగా దేశభక్తి గీతాలు రచించిన కవుల కవిత్వరచనలు, చిత్రలేఖనం తదితర అంశాలతో చిత్రలేఖన ప్రదర్శన ఏర్పాటుచేసారు. విద్యార్థినులు తమ చిత్రలేఖనం, కవిత్వం ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించడంతో కళాశాల ప్రిన్సిపాల్ కె.మనోహన్ విద్యార్థినుల చిత్రలేఖన నైపుణ్యాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తెలుగువిభాగం అధ్యాపకులు ప్రొఫెసరు జి. ఉషారాణి, అసిస్టెంట్ ప్రొఫెసరు సజనీ, హిందీవిభాగశాఖాధ్యక్షులు డా.ఎస్. షమ్స్ అక్తర్, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

## పివికెయన్ కళాశాలలో రక్తదాన శిబిరం

చిత్తూరురూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త:
స్థానిక పివికెయన్ ప్రభుత్వ కళాశాల నందు ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేసారు. రెడ్‌క్రాస్ సభ్యులు, విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆనందర్‌రెడ్డి, వైఆర్‌సి కోఆర్డినేటర్ ఎం.ఇస్మాయిల్, ఆర్‌ఆర్‌సి కోఆర్డినేటర్ డా. తేజమూర్తి, ఆకడమిక్ కోఆర్డినేటర్ డా. మోహన్‌బెహరా, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న పాలన సంక్షేమానికి స్వర్ణయుగం

: ఎంపిటిసి లేఖ్యాబాలు

గంగవరం, ఆగష్టు 3, ప్రభాతవార్త :
జనం కోసం పుట్టిన నాయకుడు మన జగనన్నని,ఎవరెన్ని కుట్రలు,కుయుక్తులు పన్నినా జగనన్న మాటిచ్చాడంటే మడమ తిప్పడని జగనన్న పాలన సంక్షేమానికి స్వర్ణయుగమని గంగవరం ఎంపిటిసి2 లేఖ్యాబాలు అభివర్ణించారు. బుధవారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించి,ప్రారంభించిన రైతు భరోసా కేంద్రంలో నూతనంగా మంజూరైన 27 పంఛన్‌లను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు,సంక్షేమ పథకాలతో రాష్ట్రమంతా కలకళలాడుతోందన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఎనెన్ని సంక్షేమ పథకాలు,ఎనెన్ని ప్రజా వాహనాలు ఒకదాని తరువాత ఒకటి పరుగులు తీస్తుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మంజునాథరెడ్డి,నాయకులు బోస్‌రెడ్డి,వేలు,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పిఇఎస్ ఆస్పత్రిలో తల్లిపాల వారోత్సవాలు

కుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త



ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పిఇఎస్ వైద్య కళాశాల ఆస్పత్రిలో ఈనెల 7వతేది వరకు నిర్వహిస్తున్నట్లు ఎంఎస్ డా॥ చెన్నబసవ పాటిల్,చిన్నపిల్లల విభాగాధిపతి డా॥రాజేంద్రనాయుడు పేర్కొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి తల్లి పిల్లలకు కాన్పు అయిన అర్ధగంటలోగా తల్లిపాలు అందించకుంటే పిల్లలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. తల్లి పాలు పిల్లలకు అమృతంతో సమానమన్నారు. ఏటా పిఇఎస్‌లో ప్రసూతి, చిన్నపిల్లల విభాగాల్లో తల్లి పాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రసూతి విభాగాధిపతి డా॥ ప్రదీప్, డా॥ విజయశంకర, డా॥ హర్ష, నర్సింగ్ ప్రిన్సిపాల్ బాలలక్ష్మి పాల్గొన్నారు.

## లోకేష్‌ను విమర్శించే స్థాయి ఎమ్మెల్యే బాబుకు లేదు

చిత్తూరురూరల్, ఆగస్టు3 ప్రభాతవార్త :
నారాలోకేష్, నారాచంద్రబాబునాయుడులను విమర్శించే స్థాయి పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబుకు లేదని చిత్తూరు పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ పేర్కొన్నారు. స్థానిక సంస్థలు ఏర్పడినప్పటి నుంచి పాలూరు గ్రామపంచాయతీ నందు తెలుగుదేశం పార్టీ హవా కొనసాగుతున్నదనీ, గతంలోజరిగిన స్థానిక సంస్థ ఎన్నికల్లో అధిష్టాన కోరిక మేరకు సర్పంచు పోటీ నుంచి విరమించుకోవడం జరిగిందన్నారు. పాలూరు గ్రామపంచాయతీలో సర్పంచుగా పోటీ చేయడానికి కార్యకర్తలు సిద్ధంగా వున్నారనీ, మా నాయకులు నారాలోకేష్, బాబు పోటీ చేయాల్సిన అవసరం లేదన్నారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు క్రీడాసామగ్రి పంపిణీ

కుప్పంరూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త
స్థానిక డా॥ వైసి జేమ్స్ ఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు లయన్స్ క్లబ్ అధ్వర్యంలో సుమారు 15వేల విలువ చేసే క్రీడా సామగ్రిని వితరణగా అందించారు. ఈసందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డా॥ మహేష్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలపై అవగాహన కల్పించడంతో పాటు వారికి తమవంతు ప్రోత్సాహం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, లయన్స్ క్లబ్ కార్యవర్గం సోము, సెంధిల్, సెల్వం,మతీన్, హెచ్ఒడి సుబ్బన్న, డా॥ రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

సూళ్లూరుపేట,కోట,వెంకటగిరి ,బాలాయపల్లి దొరవారిసత్రం,

## బిజెపి యువ సంఘర్షణ యాత్రకు ఘనస్వాగతం

బాలాయపల్లి ఆగస్టు 3 ప్రభాతవార్త



తిరుపతి నుండి విజయవాడకు బయలుదేరిన బిజెవైఎం యువ సంఘర్షణ యాత్ర రా ్యలీకి మండలంలోని వెంగమాంపురం గ్రామం వద్ద నియోజక వర్గ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు,ప్రశాంతి,మల్లీశ్వరి,నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని తెలిపారు. యువతకు ఉద్యోగ ,ఉపాధి కల్పించకుండా వారి జీవితాలతో ఆడు కుంటున్నట్లు తెలిపారు. 2024 సంవత్సరంలో బిజెపిని గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యం అవుతుందని తెలిపారు. సోమశిల–స్వర్ణముఖి కాలువ పనులను పూర్తి చేయిస్తానని తెలిపారు. కేంద్రం ఇస్తున్న నిధులతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## శ్రీహరికోట ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలు

శ్రీహరికోట (తడ), ఆగస్టు 3 ప్రభాతవార్త



శ్రీహరికోటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. 75 సంవత్సరాల స్వాతంత్ర్య ఉత్సవాలలో భాగంగా ఉన్నత పాఠశాలలో ఉత్సాహంగా పోటీలు జరిపారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో ఆగస్టు 15న జరిగే కార్యక్రమంలో విజేతలకు బహుమతులు పంచిపెడతామని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యా యుడు సన్నాయి భాస్కర్, సహచర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దుక్కులకు సన్నద్ధమవుతున్న రైతన్నలు

దొరవారిసత్రం, ఆగస్టు 3 ప్రభాతవార్త
దొరవారిసత్రం మండలం పూలతోట, కట్టవపల్లి, కల్లూరు, కల్లూరుకండ్రిగ, నెలబల్లి, ఏకొల్లు, అగ్రహారం, అక్కరపాక, సూరపుఅగ్రహారం తదితర గ్రామాల్లోని మెట్టప్రాంత రైతులు దుక్కులతో సంసిద్ధం అవుతున్నారు. మెట్ట ప్రాంతాల రైతులు ఎలిది పైర్లు వేయడానికి ఉన్న మెట్ట భూముల్లో ట్రాక్టర్ల సహాయంతో దుక్కులు చేస్తున్నారు. ఈ క్రమంలో పొలాల్లో ఉన్న మడుమలకు గడ్డి నివారణ మందు పిచికారీ చేస్తూ పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఆగస్టు, సెప్టెంబర్ మధ్యలో ఎలిదిపైర్లు వేయడానికి రైతులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## కారును ఢీకొన్న లారీ

చిల్లకూరు ఆగష్టు 3 ప్రభాతవార్త



మండలంలోని జ్యోతివే బ్రిడ్జి సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం నాయుడు పేట నుండి నెల్లూరు వైపు వెళుతున్న పెన్వర్ రొయ్యల పరిశ్రమ డైరక్టర్ గంటా మధుకృష్ణ కారును వెనుక నుండి డ్రైవర్ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతోపాటు మరో కారును కూడా ఢీకొందిది. ఈ ప్రమాదానికి డ్రైవర్ మద్యం సేవించి నడిపాడని అక్కడున్న స్దానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే చిల్లకూరు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి సంఘటనా స్దలానికి చేరుకొని కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. లారీడ్రైవర్ పరారీలో ఉన్నాడు. లారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కారులోవున్న వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

## పాఠ్యపుస్తక రచయతకు ఘనసన్మానం

కార్వేటినగరం,ఆగస్టు 3 ప్రభాతవార్త:



కార్వేటినగరం మండలం కత్తెరపల్లె జడ్‌పి హైస్కూల్ గణిత ఉపాధ్యాయులు జయరాజ్‌శేఖర్‌కు బుధ వారం ఘనసన్మానం లభించింది. యస్సీఈఆర్టీ తరపున 8వ తరగతి గణితపుస్తకాన్ని రూపొందించారు. ఈ పుస్తకాన్నీ డిసిఈబి సెక్రటరీ,ప్రధానోపాధ్యాయులు కె.హేమారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యా యులు, విద్యార్థులు తరపున రచయితకు ఘనసన్మా నం చేశారు. ఇంతటి నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు మన పాఠశాలలో పనిచేయడం గర్వకారణం అని గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాసుదేవరెడ్డి,రవిచంద్రారెడ్డి, చలపతిరావు, విశ్వనాథనారాయణ,బీమారావు,శ్రీనివాసులు, అక్కారిబాబు,మధు,మురళీకృష్ణ, తిరుమ లేశం, హరి,లోకనాధంలు పాల్గొన్నారు.

# డీఆర్‌పై రాజకీయ బురద చల్లితే సహించం

కోట, ఆగస్టు 3 ప్రభాతవార్త
వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు కొడవలూరు ధనంజయరెడ్డిపై రాఘవాపురానికి చెందిన రాజేంద్ర, మరికొందరు రాజకీయ బురద చల్లాలని చూస్తే ఊరుకునేది లేదని కోట మండలం చిట్టేడు మాజీ సొసైటీ ఛైర్మన్ పుట్టా నారాయణ, మద్దాలి మాజీ జలసంఘం అధ్యక్షుడు శివరామనాయుడు, కోట మండల అధ్యక్షురాలు దాసరి అంజమ్మ, నాగరాజు, గోనుపల్లి మస్తాన్‌లు అన్నారు. వారు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రాజేంద్రపై ధ్వజమెత్తారు. మేమంతా ఆ నాడు దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి వర్గంగాఉండేవారమని,ఆయన మరణానంతరం కొడవలూరు ధనంజ



యరెడ్డికిదగ్గరయ్యామనిచెప్పారు. మద్దాలి,కేశవరం, చిట్టేడు గ్రామాల్లో తాగునీరు, సాగునీరు, గుడి, బడి, అంతర్గత రోడ్లు అభివృద్ధి చేసింది ధనంజయరెడ్డే అని చెప్పారు. బడుగు, బలహీన వర్గాల ప్రజా నాయకుడు ధనంజయరెడ్డిని విమర్శించే నైతిక హక్కు వారికి ఎక్కడిదని ప్రశ్నించారు. చిట్టేడు సొసైటీలో గత టీడీపీ హయాంలో మూడు కోట్ల రూపాయలు అభివృద్ధి జరిగిందని, ఆ సంఘటనపై ఇటీవల అధికారులు విచారణ కూడా పూర్తి చేశారన్నారు. ఈ నేపథ్యంలో త్రీమెన్ కమిటీని రద్దు చేయాల్సిన అవసరం మాకు లేదన్నారు. ఎంపీటీసీఎన్నికల్లోడీఆర్‌సైన్యం కష్టపడి పనిచేసి విజయం సాధించామన్నారు. ఇందులో రాఘవాపురానికి చెందిన రాజేంద్ర పాత్ర ఏమీ లేదన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యులు దాసరి కోటయ్య, మద్దాలి నాగరాజు, గోనుపల్లి మస్తా నయ్య, వెంకటయ్య, వెంకటరత్నం, చంద్రయ్య, హరి, వెంకటేశ్వర్లు, నాగేంద్ర, మహిళా నాయకురాలు శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాప్రదాత నేదురుమల్లి బాలకృష్ణారెడ్డికి నివాళి

కోట, ఆగస్టు 3 ప్రభాతవార్త



దివంగత పద్మశ్రీ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి 44వ వర్ధంతిని కోట మండలంవిద్యానగర్‌లోనిఎన్‌బీకేఆర్‌విద్యాసంస్థలప్రాంగణంలో నిర్వహించారు. ముందుగా ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టీ డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది బాలకృష్ణారెడ్డి విగ్రహానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నతికి బాలకృష్ణారెడ్డి చేసిన సేవలు మరువలేమన్నారు. ఈ పరిసర ప్రాంతాల అభివృద్ధికి ప్రధాన కారణం ఈ విద్యాసంస్థలే అని పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలను రాష్ట్రంలోనే టాప్ కళాశాలల్లో ఒకటిగా చేయడంలో ఎనలేని కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాధిపతులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేల మద్దతు కూడగడుతున్న ఎంఎల్‌సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి

కోట, ఆగస్టు 3 ప్రభాతవార్త



తూర్పురాయలసీమ పట్టభద్రుల (చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం) వైసీపీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సీల మద్దతు కూడగడుతూ వారిని కలుస్తూ ముందుకు పోతున్నారు. చీరాల ఇన్‌ఛార్జ్ ఆమంచి కృష్ణమోహన్‌ను, అద్దంకి ఇన్‌ఛార్జ్ కృష్ణచైతన్య, ఎంఎల్‌సీ పోతుల సునీత, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామ్, దర్శి ఎమ్మెల్యే వేణుగోపాల్, బాపట్ల ఎంపీనందిగామసురేష్, ప్రకాశం జిల్లా జడ్పీ ఛైర్మన్ వెంకాయమ్మ, మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే, టీటీడీ సభ్యులు మధుసూదన్‌యాదవ్, కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి తదితరులను కలిసి జరగనున్న ఎంఎల్‌సీ ఎన్నికల్లో తనకు సహకరించాలని కోరారు.

## మున్సిపల్ కాంప్లెక్సు దుకాణాల వద్ద తనిఖీ

గూడూరు,ఆగస్టు 3 ప్రభాతవార్త
గూడూరు పట్టణంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కాంప్లెక్స్ దుకాణాలలో మున్సిపల్ కమిషనర్ తోట సాయినాథ్ తనిఖీలు నిర్వహించారు. లీజుకు దుకాణాలు పొందిన వ్యక్తులు కాకుండా లీజుదారుల వద్ద కొనుగోలు చేసిన వ్యక్తులు చేతుల్లో దుకాణాలు నడుస్తున్నాయనే ఫిర్యాదులు అందడంతో మున్సిపల్ సిబ్బందితో కలిసి కమిషనర్ తనిఖీలు నిర్వహించారు. బుధవారం నాడు దుకాణాల వద్దకు వెళ్లి ఎవరి పేరు తోదుకాణాలుఉన్నాయి ఎవరు నిర్వహిస్తున్నారనే దానిపై రికార్డులను పరిశీలించారు. మున్సిపాల్టీకి పన్ను కట్టాలని కోరితే పలువురు కోర్టును ఆశ్రయించారని ఎవరైనా దుకాణాలు అమ్మినట్లయితే విచారణ జరిపి తీసుకుంటామనితెలిపారు. దుకాణాలఎవరిపేరుతోఉంటాయేవారేవ్యాపారాలునిర్వహించుకోవాలన్నారు.

## బిజెపితోనే అభివృద్ధి సాధ్యం –నియోజవర్గ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు

వెంకటగిరి ఆగస్టు 3 పభాతవార్త



రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే బిజెపిని గెలిపించాలని ఆ పార్టీ నియోజవర్గ ఇన్‌చారి ఎస్ఎస్ఆర్ నాయుడు తెలిపారు. తిరుపతి నుండి బయలుదేరిన యువ సంఘర్షణ యాత్ర బుధవారం వెంకటగిరికి చేరుకోగా బిజెపి నేతలు ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడు తూ రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించకుండా వారి జీవితాలతో ఆడుకుంటున్నట్లు తెలిపారు. 2024 సంవత్సరంలో బిజెపిని గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. సోమశిల-స్వర్ణముఖి కాలువ పనులను పూర్తి చేయిస్తానని తెలిపారు. కేంద్రం ఇస్తున్న నిధులతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ అల్లం చంద్రమోహన్ నాయకులు యేగేశ్వరనాయుడు,భాస ్కర్, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్న తోడు రుణాల పంపిణి

బాలాయపల్లి ఆగస్టు 3 ప్రభాతవార్త



మండలంలో ఐదవ విడత జగన్న తోడు పథకం ద్వారా 67 లక్షల 30 వేల రూపాయలు పంపిణీ చేసినట్లు ఎంపిడిఓ రమణయ్యతెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 673 సంఘ సభ్యులకు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. తీ సుకున్న రుణాలు సద్వినియోగం చేసుకొని సకాలంలో చెల్లించాలని కోరారు. సిఎం జగన్‌మోహన్ రెడ్డి సభను ప్రత్యేక్ష లైవ్‌ల్లో విక్షించారు. ఎపిఎం కిరణ్, సర్పంచి బి.వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నా న్నారు.

## కోర్టు విధులను బహిష్కరించిన న్యాయవాదులు

గూడూరు,ఆగస్టు 3 ప్రభాతవార్త
రెండో పట్టణ పరిధిలోని కోర్టులో న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించారు. తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్‌లో న్యాయవాది హత్యకు గురవడంతో అందుకు నిరసనగా బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి హత్యకు కారకులైన వ్యక్తులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. పేదల పక్షాన నిలబడి న్యాయం కోసం పోరాడే న్యాయవాదులను హత్య చేయడం దారుణమన్నారు. న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరారు. హత్యకు పాల్పడిన నిందితులను పోలీసులు అరెస్టు చేసి కఠినంగా శిక్షపడేలా చూడాలన్నారు. న్యాయవాదులుతేజేం ద్రకుమార్, రేష్మా, చంద్రశేఖర్, గోపాల్‌రెడ్డి, కోటేశ్వరరావు, సునీత

# రైతుల పక్షపాతి జగన్‌మోహన్‌రెడ్డి :ఎమ్మెల్సీ

చిల్లకూరు ఆగష్టు 3 ప్రభాతవార్త
రాష్ట్రంలో రైతులు సంక్షేమమే ధ్యేయంగా జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎంఎల్‌సి బల్లి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. బుధవారం తిక్కవరం గ్రామ సర్పంచ్ ఒడూరు సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సచివాలయాన్ని,రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత ్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని త్వరలో ప్రారంభించడం జరుగుతుందని వారు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ఆర్‌బికెలో విప్లవాత్మకమైన మార్పు తీసుకొని



వచ్చారని అన్నారు. ప్రపంచ దేశాలు మన రాష్ట్రంలో ఆర్‌బికె లో అమలౌతున్న సంక్షేమ కార్యక్రమాల గురించి తెలుసుకుంటున్నారని అన్నారు. అనంతరం చేడిమాల గ్రామంలో వైసిపి నాయకులు రాజనేని నాగేశ్వరరావునాయుడు ఉత్తరక్రియలలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా తొణుకు మాల గ్రామంలోని వెందేటి చక్రపాణిరెడ్డి తండ్రి శంకర్‌రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో జడ్‌పిటిసి మన్నెం శ్రీనయ్య,సర్పంచ్‌లు సత్యనారాయణరెడ్డి,త్రివి క్రమ్ భూపతి,వైసిపి నాయకులు దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, పెనుబోలు జానకిరామిరెడ్డి, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి,రాజనేని శ్రీనివాసులునాయుడు, పిచ్చయ్యానాయుడు,ఎస్‌కె సందానీభాషా ,శివ,పాల్గొన్నారు.

# భూమనతోనే బలిజలందరూ అనడానికి సిగ్గుపడాలి!

## -బలిజలకు ప్రత్యేకంగా ఏంచేశారో చెప్పండి -డిప్యూటీ మేయర్ ముద్రనారాయణకు కాపు సంక్షేమ సేన ప్రశ్న

**తిరుపతి ప్రెస్‌క్లబ్, ఆగస్టు 3 ప్రభాతవార్త:**

భూమన కరుణాకర్‌రెడ్డి కుటుంబంతోనే తిరుపతి బలిజలందరూ ఉన్నారని ఏకపక్షంగా నిర్ధారించి చెప్పుకోవడానికి నగర డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణకు,ఇతర నామినేటెడ్ పదవులు స్వీకరించిన కొందరు బలిజ కులస్తులకు సిగ్గుండాలని 'కాపు సంక్షేమ సేన' రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తిన మధుబాబు మండిపడ్డారు.బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన కాపు సంక్షేమ సేన రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాళ్లుఆకేపాటి సుభాషిణి,కీర్తన,నేతలు రామారావు,హిమంత్, రమేష్, రాజు, రవి,బన్ని,రాములతో కలిసి 'భూమనతో ఉన్న బలిజలు' 10 మందా?లేకా 12 మందా అని ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మంగళవారం ప్రెస్‌మీట్‌లో



నగర కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ,మరి కొందరు బలిజలు తాము ఎప్పటికీ భూమన కుటుంబంతోనే ఉన్నాము.ఆయన బలిజలకు అవి చేశాడు,ఇవి చేశాడు అని ఊరికే ఊదరకొట్టారు. భూమన నిజంగా తిరుపతి బలిజలకు ఇవి చేశాడు అని ఆధారాలతో చెప్పకుండా మేము ఆయన వెంటే అని చెప్పడం బాధాకరమన్నారు. మీకు డిప్యూటీ మేయర్ పదవి ఇచ్చారని సంతోషంగా ఉన్నారు.కానీ మీ పక్కన మరో పెద్ద గీతగీసి భూమన కుమారుడికి మరో డిప్యూటీ మేయర్ పదవి ఇచ్చి,పవర్ మొత్తం వారు తీసుకున్నారు. అనంతరం ఆకేపాటి సుభాషిణి మాట్లాడుతూ తిరుపతిలోని బలిజలకు ఇప్పటి వరకు భూమన కరుణాకర్‌రెడ్డి మోసం తప్ప మేలు చేయలేదన్నారు.బలిజలపై జగన్‌కు నిజంగా ప్రేముంటే 2024లో తిరుపతిసీటు బలిజలకే ఇవ్వాలని సవాల్ విసిరారు.తరువాత కీర్తన మాట్లాడుతూ తాము పోరాటం చేస్తున్నది కాపుల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి,కాపులు రాజకీయంగా ఎదగడానికి మాత్రమేనని ముద్ర నారాయణ గుర్తించాలన్నారు.

## అమ్మవారి సేవలో గుండాల గోపీనాద్

**తిరుచానూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త:**

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని బుధవారం బిజెపీ జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథ్‌రెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేకదర్శనం కలి ్పంచారు. అనంతరం వేదాశీర్వచనం అమ్మవారి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరలక్ష్మీవ్రతం సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికి వుండాలని ప్రార్థించినట్లు తెలిపారు.

## బావిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం..!

**నారాయణవనం, ఆగస్టు 3 ప్రభాతవార్త :**

మండలంలోని ఎరికంబట్టు పంచాయతీ పరిధిలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలకు ఉత్తర భాగంలోని కోమిటివారి బావిలో ఓ మృతదేహాన్ని బుధవారం మధ్యాహ్నం పశువుల కాపరులు గుర్తించారు. పశువులను మేపే సమయంలో దుర్వాసనను గుర్తించి ఎరికంబట్టుకు చెందిన కాపరులు బావి వద్దకు వెళ్లి చూశారు. బావిలో సుమారు 20 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. మృతుని కాళ్లు, చేతులు, నడుంను తాడుతో కటేసి వున్నారు. సమాచారం తెలుసుకున్న తహశీల్దారు ప్రమీల, విఆర్ఓ పళని, ఎఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందితో ఘటన స్థలానికి వెళ్లారు. మృతదేహం కుళ్లిపోవడం వల్ల గుర్తు పట్టలేని స్థితిలో వుంది. దీనికి తోడు మృతదేహానికి బయటకు తీయడానికి వీలు పడే పరిస్థితి కనబడలేదు. దీంతో గురువారం జెసిబి లేదా క్రేన్ సాయంతో బయటకు తీస్తామని పోలీసులు తెలిపారు. తహశీల్దారు ప్రమీల సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలకు చేరుకొని విద్యార్థుల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. కళాశాల నుంచి ఎవరైనా విద్యార్థులు కనపడకుండా వుంటే వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం మృతుని వివరాలు తెలిసే అవకాశం వున్నది.

## రేపటి నుండి ద్రౌపతిదేవి సమేత ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాలు

**నారాయణవనం, ఆగస్టు 3 ప్రభాతవార్త :**



మండలకేంద్రంలోని నారాయణవనంలో ప్రసిద్ది చెందిన ద్రౌపతిదేవి సమేత ధర్మరాజులస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 5వతేది నుంచి 15వతేది వరకు జరుగుతుందని ఆలయ ధర్మకర్త టిఎస్.సొరకాయలురెడ్డి తెలిపారు. ఈనెల 5వతేది శుక్రవారం సాయంత్రం 5గంటలకు ధ్వజారోహణం, 6,7,8వతేదీల్లో సప్రవాహనాలపై నాగిలేరు, ఎరికంబట్టు, తిరువట్యం గ్రామాల్లో ఊరేగింపు, 9వతేది మంగళవారం అశ్వవాహనం, నిర్చితార్థం, రాత్రి కల్యాణోత్సవం, 10వతేది బుధవారం రెడ్డివీధి ఊరేగింపు, సాయంత్రం ఒడియార్ ఉత్సవం, 11వతేది గురువారం సర్వభూపాలవాహనం, భక్తులు ముళ్ల గుచ్చు కార్యక్రమం, 12వతేది శుక్రవారం అర్జునతపస్సు, సాయంత్రం భాణసంచావేడుకలు (వాణి వైశ్యుల సంఘం), 13వతేది శనివారం అలుగు ఉత్సవం, రాత్రి గరుడసేవ, 14వతేది ఆదివారం సాయంత్రం అగ్నిగుండం, రాత్రి సింహావాహనంపై ఊరేగింపు, 15వతేది ధ్వజ అవరోహనం, పట్టాభిషేకంతో ముగుస్తుందన్నారు. ఈనెల 5నుంచి15వతేది వరకు తిరుపతికి చెందిన ఎం.పూర్ణ మహాభారతం చెబుతుందన్నారు. ఈనెల 9నుంచి15వ తేది వరకు రాత్రిపూట మేలపట్టుకు చెందిన చెందిన వారు వీధినాటకం నిర్వహించడం జరుగుతుందన్నారు. అగ్నిగుండ ప్రవేశం చేసే భక్తులు ఒక్కరికి 200 రూపాయాలను కంకణంగా చెల్లించాలన్నారు.

## పిడుగు పాటు బాధితులకు రోజా ట్రస్ట్ ఆర్థిక సాయం

**పుత్తూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త :**



నగరి గ్రామీణ మండలం పరిధిలోని బుగ్గ అగ్రహారం గ్రామంలో పిడుగు పాటుకు నష్టపోయిన కుటుంబానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా చారిటబుల్ ట్రస్ట్ తరపున ఆమె సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి బుధవారం రూ. 50,000 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ నెల 2న భారీ వర్షంతో పాటు పిడుగుపడడం వల్ల గ్రామంలోని ఈశ్వరయ్య, రేణుకమ్మ దంపతుల ఇల్లు మంటలకు ఆహుతైంది. ఇంట్లో వస్తువులు కాలిపోవడంతో కుటుంబం కట్టుబట్టలతో మిగిలారు. విషయం తెలిసిన మంత్రి సోదరుడు కుటుంబ సభ్యులను స్వయంగాకలిసి పరామర్శిం చారు. రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం అందించారు. దీంతో పాటు బియ్యం, పప్పు వంటి నిత్యావసర వస్తువులు, కుటుంబ సభ్యులు ఒకొక్కరికి అయిదు జతల వస్త్రాలను పంపిణీ చేశారు.

## ఆలయానికి సర్కారుహారతుల వితరణ

**శ్రీకాళహస్తి, ఆగస్టు 3 ప్రభాతవార్త**



మండలంలోని తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవిభూదేవి సమేత ప్రసన్నవెంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం బెంగుళూరుకు చెందిన ఎం.రాజ్యలక్ష్మి వారి కుటుంబసభ్యులు రూ.లక్షవిలువచేసే రెండు దూప, సర్కారుహారతిలను ఆలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్, అర్చకులు, సిబ్బందికి అందించారు.ఈ సందర్భంగా దాతలకు ఆలయాధికారులు స్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలను అందించి ప్రత్యేక ఆశీర్వచాలను అందించారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషిచేయాలి

-జనవిజ్ఞానవేదిక




**శ్రీకాళహస్తి, ఆగస్టు 3 ప్రభాతవార్త**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని జనవిజ్ఞానవేదిక పర్యావరణ పరిరక్షణ విభాగం జిల్లా కన్వీనర్ జి.సుధాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ద స్కూల్ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ద స్కూల్ కరస్పాండెంట్ జనార్ధన్‌రావు జె.పవార్ విచ్చేశారు. ఈసందర్భంగా జనవిజ్ఞానవేదిక పర్యావరణ పరిరక్షణ విభాగం జిల్లా కన్వీనర్ జి.సుధాకర్ మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రకృతిలో ఉన్న జీవరాసులు మానవులకు ఏవిధంగా ఉపయోగపడుతాయో ప్లెక్సీల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించి వారిలో చైతన్యాన్ని నింపారు. కార్యక్రమంలో వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ పర్యావరణ పరిరక్షణ విభాగం జిల్లా కన్వీనర్ జి.సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు అరుణశివప్రసాద్, జిల్లా మ్యాథ్స్ పోరం చంద్రంనాయుడు, జనవిజ్ఞానవేదిక నాయకులుషరీఫ్, సంపత్‌కుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యురాలు ఊహ, ద స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విశాల, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా భీమినేని నరసింహులు నాయుడు

**పెనుమూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త:**

పెనుమూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా పెనుమూరుకు చెందిన భీమినేని నరసింహులు నాయుడును నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నరసింహులు నాయుడు మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం, పటిష్టతకు కృషి చేస్తానని, అలాగే ప్రజా సమస్యలపై స్పందిస్తూ వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని ఆయన పేర్కొన్నారు.

## ఆజాద్‌కా అమృత్ మహోత్సవ కార్యక్రమం

**కార్వేటినగరం,ఆగస్టు 3 ప్రభాతవార్త:**

కమీషనర్ ఆదేశాల మేరకు అన్ని పాఠశాలలో ఈనెల 1నుండి15వ తేదీ వరకు ఆజాద్‌కా అమృత్ మహోత్సవం నిర్వహించాలని ఎంఇఓ విజయ్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా కార్వేటినగరం జడ్‌పి బాలికల హైస్కూల్లో కార్యక్రమం నిర్వహించారు. సమర యోధులు శ్రీకాకాణి వెంకటరత్నం గురించి ఎంపిడిఓ చిన్నరెడ్డెప్ప కొనియాడారు. తాహాశీల్దారు అమర్‌నాథ్ మాట్లాడుతూ స్వాతంత్రం కోసం వారు సేసిన త్యాగాలను వివరించారు. విద్యార్థులందరూ దేశభక్తిని అలవర్చుకోవాలని తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనంజయవర్మ,చైర్మన్ చాముండేశ్వరి,వైస్‌చైర్మన్ మమత,ఎఇ నాగభూషణం,ప్రధానోపాధ్యాయురాలు నాగభూషణమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ జ్వరాలపై విద్యార్థులకు అవగాహన

**తొట్టంబేడు, ఆగస్టు 3 ప్రభాతవార్త**



ప్రసుత్త సీజనల్ జ్వరాలపై విద్యార్థులందరు అవగాహన కలిగి ఉండఆలని తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సూపర్‌వైజర్ కామరాజు అన్నారు. బుధవారం మండలంలోని బసవయ్యపాళెం సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు, కళ్ళిపూడి పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై వైద్యాధి కారిణి డాక్టర్ పద్మజ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ జ్వరాలపై అవగాహన కలిగి ఉండాలని దోమల వల్ల వచ్చే వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటివి వ్యాపించి ప్రజారోగ్యం దెబ్బతినకుండా ప్రతి శుక్రవారం జరుగుతున్న ఫ్రైడే డ్రైడేలో ఆశా, ఎఎన్ఎం, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొని దోమల లార్వా ఉత్పత్తి స్థావరాల గుర్తింపు, నిర్మూలన జరిగేలా చూడాల్సిన అవసరమెంతైనా ఉందని పేర్కొన్నారు. నీళ్ళ విరేచనాలు లేదా డయేరియా ప్రజారోగ్యానికి హానిచేస్తోందని దీనికి ఓఆర్ఎస్ మరియు జింక్ మాత్రమే చికిత్సగా పేర్కొన్నారు. దీంతో మరణాలు తగ్గడమే కాకుండా వారిలో శక్తిని మరియు బాలాన్ని యదాస్థితికి తీసుకొస్తుందన్నారు. హెల్త్‌సూపర్‌వైజర్ కామరాజు తెలిపారు. పిల్లల్లో డయేరియా కలగకుండా పాలిచ్చే తల్లి అతిసారం, అనారోగ్య సమయంలో మరియు తర్వాత కూడా విరేచనాలతో బాధపడుతున్న బిడ్డకు పాలివ్వడం ఆపరాదనీ ముఖ్యంగా పిల్లలకు రోజువారికన్నా అదనపు పాలు మరియు పోషకాహారం ఇవ్వాలని సూచించారు. పరిశుభ్రమైన పిల్లలకు రోజువారి కన్నా అదనపు పాలు మరియు పోషకాహారం ఇవ్వాలని సూచించారు. పారిశుద్యమే సీజనల్ వ్యాధులకు ప్రధాన కారణం అన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి గీత, ఎఎన్ఎం డిల్లీరాణి, వాలంటీర్లు గోవర్ధన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిబిఎ కోర్సులకు దరఖాస్తు చేసుకోండి!

-దేశ విదేశాల్లో వంద శాతం ఉద్యోగ కల్పన

**తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 3 ప్రభాతవార్త:**

స్థానిక రేణిగుంటలోని 'ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్'లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు డిగ్రీ చేయడానికి దరఖాస్తు చేసుకోవాలని, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ త్రిలోక్ చందర్,ప్రొఫెసర్ చల్లేశ్వరరావులు పిలుపునిచ్చారు.బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 2018లో ఈ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు.భారతదేశంలో అలాగే మన తెలుగు రాష్ట్రాలలో కలిపి ఉన్నది కేవలం ఈ ఒక్క ఇన్‌స్టిట్యూట్ మాత్రమే అన్నారు. మూడు సంవత్సరాల బిబిఎ కోర్సులు చేయడానికి ఇంటర్మీడియట్‌లో 50 శాతం మార్కులు పొంది ఉండాలన్నారు.మూడేళ్లలో ఆరు సెమిస్టర్లకు కలిపి 4 లక్షల 20 వేలు ఫీజు ఉంటుందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 10వ తేదీ ఆఖరని, ఆన్‌లైన్ పరీక్ష 12వ తేదీ నిర్వహించి, అందులో పాసైన విద్యార్థులకు 16న సీట్లు కేటయిస్తామన్నారు.ఒక బ్యాచ్‌కు 120 మంది మాత్రమే అన్నారు.దరఖాస్తు చేసుకునేవారు హెచ్‌టిటిపిఎస్/డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ. ఐసిఐఎన్ఒఐడిఎ.కామ్/హెచ్‌టిటిపిఎస్:డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఐసిఐఒటిఐఆర్‌యుపిఎటిఐ.ఇన్ అనే వెబ్ సైట్ నందు సంప్రదించాలన్నారు.

## బస్సుల్లో ఏ ఇబ్బందులు లేకుండా చూడండి!

-గ్యారేజీ సూపర్‌వైజర్లు,మెకానిక్కులకు డిపిటిఒ ఆదేశం

**తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 3 ప్రభాతవార్త:**



త్వరలో రానున్న తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని ఘాట్ రోడ్డు నందు ప్రయాణించే బస్సుల్లో ఎలాంటి సాంకేతిక సమస్యలు లేకుండా ప్రయాణికులకు మంచి ప్రయాణాన్ని అందించాలని తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి(డిపిటిఓ)టి.చెంగల్‌రెడ్డి ఆర్టీసీ డిపో గ్యారేజీ సూపర్‌వైజర్లు,మెకానిక్కులు,ఎలక్ట్రీషియన్లను ఆదేశించారు.బుధవారం స్థానిక ఆర్.ఎం కార్యాలయం నందు తిరుపతి రీజియన్‌లోని 8 ఘాట్ డిపోలకు చెందిన గ్యారేజీ సూపర్‌వైజర్లు,మెకానిక్కులు, ఎలక్ట్రీషియన్లకు అశోక్ లేల్యాండ్ బిఎస్-3,బిఎస్-4 బస్సులకు సంబంధించి బ్రేక్ సిస్టం పైన ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.తిరుపతి డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ నరసింహులు, అసిస్టెంట్ ఇంజనీర్ మహేంద్ర,గ్యారేజీ సూపర్‌వైజర్లు,మెకానిక్కులు,ఎలక్ట్రీషియన్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బ్యాంకు సేవలపై కళాజాత బృందాలతో అవగాహన

సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శ్రీదేవి

**చంద్రగిరి, ఆగస్టు 3 ప్రభాతవార్త:**



ప్రభుత్వ రంగంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌లో ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రత పథకాలపై కళాజాత బృందాలతో గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఏ.రంగంపేట బ్రాంచి మేనేజర్ శ్రీదేవి తెలిపారు. మండల పరిధిలోని భీమవరంలో బుధవారం కళాజాత బృందాల ద్వారా గ్రామస్థులకు తమ బ్యాంకు ద్వారా లభిస్తున్న, అందిస్తున్న సేవలను ఆమె వివరించారు. ప్రభుత్వ రంగంలోని బ్యాంకులలో మీరు దాచుకునే ప్రతి రూపాయికి నాబార్డ్, ఇండియన్ బ్యాంక్, రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పిస్తాయన్నారు. అదేవిధంగా డిపాజిట్స్‌పై మెరుగైన వడ్డీ, తక్కువ వడ్డీతో బంగారంపై రుణాలు, వ్యవసాయ రుణాలు, సబ్సిడీ రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, రైతులు ఆర్థిక స్వాలంబన సాధించడంలో బ్యాంకు సేవలు చక్కగా దోహదపడగలవన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మిత్ర రోహిణీకుమార్, ఆఫీసర్ మారుతి, ఎఫ్ఎల్‌సి జయశేఖర్, అవార్డు కళాజాత బృందం రామదాసు, దుర్గాప్రసాద్, నాగమణి, శివ, ద్వాక్రా మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## జనావాసాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్

భయాందోళనకు గురవుతున్న ప్రజలు

**రేణిగుంట ఆగస్టు 3 ప్రభాతవార్త**



రేణిగుంట పట్టణం బుగ్గవీధి మిరియాలబాబా ఆశ్రమం వెనుక వీధిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని హడలిపోతున్నారు. ఈమార్గంలోనే పాఠశాలలు, దుకాణాలు, మసీదులు, దేవాలయాలు, దర్గా, మీసేవ, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే జనాలు రాకపోకలు సాగిస్తుంటారు. కొద్దిరోజులక్రితం ఓలారీ ఈప్రాంతంలో స్థంభాన్ని ఢీకొట్టడంతో పెద్దశబ్దంతో ట్రాన్స్‌ఫార్మర్‌వద్ద మంటలు రావడం, విద్యుత్‌తీగలు తెగిపోవడం సంభవించింది. అదృష్టంశాత్తు విద్యుత్‌సరఫరా నిలిచిపోడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఐతే విద్యుత్‌లైన్లు మరమ్మత్తు, స్థంభాన్ని మరలా నిలబెట్టడానికి విద్యుత్‌శాఖాధికారులు, పంచాయతిసిబ్బంది పడినశ్రమ అంతాఇంతాకాదు. ఈసంఘటనను పలుమార్లు ఆప్రాంతవాసులు పంచాయతీ, విద్యుత్‌అధికారులను కలిసి ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాల్సిందిగా మొరపెట్టుకున్నట్లు తెలిపారు. అయినా అధికారులు స్పందించలేదంటున్నారు. అప్పట్లో ట్రాన్స్‌కోఏఈని వివరణకోరగా వారంరోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరేస్థలానికి మారుస్తామన్నారు. ఇంతవరకు మార్చకపోడంపై ఆవేదనలు వ్యక్తం అవుతున్నాయి. బుధవారం ఆప్రాంతవాసులు సంతకాలుచేసి ఓ వినతిపత్రాన్ని ట్రాన్స్‌కో ఏఈకి ఇవ్వ దానికి సిద్ధమయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షితప్రాంతానికి మార్చాల్సిందిగా వేడుకుంటున్నారు.

## తొట్టంబేడు మండలాన్ని కంచుకోటలా చేస్తాం..తెదేపా

**తొట్టంబేడు, ఆగస్టు 3 ప్రభాతవార్త**



తొట్టంబేడు మండలాన్ని తిరిగి తెలుగుదేశంపార్టీకి కంచుకోటలా చేస్తామని రాష్ట్ర తెలుగుదేశంపార్టీ కార్య దర్శి గాలిచలపతినాయుడు అన్నారు. తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకట సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాబోవు ఎన్నికలలో బూత్ కన్వీనర్లు మరియు క్లస్టర్ ఇన్‌ఛార్జిలు ఎలా వ్యవహరించాలన్న అంశాలపై సమగ్రంగా శిక్షణ ఇచ్చారు.ఈసందర్భంగా చలపతినాయుడు మాట్లాడుతూ గతంలో తొట్టంబేడు మండలం తెలుగుదేశంపార్టీకి కంచుకోటగా ఉండేదని 2019ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా జగన్మోహన్‌రెడ్డి ఒక్క ఛాన్స్ అన్న పేరుతో ప్రజలు వైకాపా వైపు మొగ్గుచూపారన్నారు. కార్యకర్తలు, నాయకులు ధైర్యంగా పోరాడి మెజారిటీ ఓట్లు సాధించాలని పిలుపునిచ్చారు. గాలిమురళీనాయుడు మాట్లాడుతూ ఎవరికి సమస్యలు బాధలు ఉన్నా తెలియజేయాలని అప్పుడే విజయందిశగా అడుగులు వేయవచ్చన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీకి పట్టాభిషేకం చేసి బొజ్జలసుధీర్‌రెడ్డి నాయకత్వంలో విజయడంకా మోగించి పార్టీని గెలిపించడమే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, భాస్కర్‌నాయుడు, చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, గుర్రప్ప, సునీల్‌కుమార్, సునీల్, కమల్‌నాథ్, సాగర్, మిన్నల్‌రవి, మునిరాజయాదవ్, శ్రీనివాసులురెడ్డి, మాధవయ్య, విజయ్, పవన్, రాఘవులు, సురేంద్రయాదవ్, భాస్కర్, తాతయ్య, భార్గవ్, దిలీప్‌కుమార్ తదితరనాయకులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఇన్నోవా అదుపు తప్పి డ్రైవర్‌కు తీవ్రగాయాలు

**చంద్రగిరి, ఆగస్టు 3 ప్రభాతవార్త:**



మండల పరిధిలోని మామందూరు వద్ద ఇన్నోవా కారు అదుపుతప్పి డివైడర్ మీదకు దూసుకుపోవడంతో కారు నడుపుతున్న దామోదర్ నాయుడు తీవ్రగాయాలపాలయ్యాడు. పి.కొత్తకోటకు చెందిన దామోదర్ నాయుడు తన ఇన్నోవా కారులో తిరుపతికి బయలుదేరారు. వ్యక్తిగతంగా వాహనాన్ని నడపుతూ వచ్చిన ఆయన మామందూరు వద్ద డీవైడర్‌పైకి దూసుకుపోయాడు. ఈ ప్రమాదంలో అద్దాలుపగలడంతోకారుపాక్షికంగాధ్వంసంకాగా, ఆయనకు తీవ్రగా యాలయ్యాయి. పోలీసులుసంఘటనాస్థలికిచేరుకునిక్షతగాత్రుడినితిరుపతి రుయాకు తరలించారు.కేసు విచారణ చేపట్టారు.

## రామసముద్రంలో ఆజాదికా అమృత్ మహోత్సవం

**పుత్తూరురూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త:**



మండలంలోని రామసముద్రం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆజాదికా అమృత్ మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా సర్పంచ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం జాతీయ జెండా ఆవిష్కరించి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంవీఎస్ వర్మ, సుశీల, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు .

## విద్యార్థినుల నైపుణ్యాభివృద్ధికి ప్రి ఇంక్యుబేషన్ ట్రైనింగ్

**తిరుపతి (విద్య), ఆగస్టు 3, ప్రభాతవార్త**



మహిళ వర్శిటీలో కళాశాల విద్యార్థినుల నైపుణ్యాభివృద్ధికై 4 ట్రాక్ ప్రి ఇంక్యుబేషన్ ట్రైనింగ్ వర్శిటీ ఉపకులపతి దువ్వూరి జమున ఆధ్వర్యంలో ఉమెన్ బయోటెక్ ఇంక్యుబేషన్ ఫెసిలిటీ నిర్వహించిన 4 ట్రాక్ ప్రి ఇంక్యుబేషన్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వంద మంది విద్యార్థినులను, అధ్యాపకులను ఉద్దేశించి షార్ట్ టర్మ్ వృత్తి విద్యా కోర్సులైన బయో ఇన్ఫర్మాటిక్స్, ఇంస్ట్రుమెంటేషన్, వ్యర్థ పదార్థాల పునర్వినియోగం, జంతు కణాభివృద్ధి వంటి కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని స్థానిక విద్యా సంస్థల విద్యార్థులు అందరూ ఉపయోగించుకోవచ్చని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీన్ నాగరాజు, సెక్రటరీ ప్రొ. జ్యోతి, సిఇఓ డా. కళారాణి, సైంటిఫిక్ ఆఫీసర్ డా. ఎన్. శిల్ప, డా. మాధవి, డా. శ్వేత విద్యార్థినులకు కావాల్సిన మెలకువల గురించి చర్చించారు.

## తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన అవసరం

**తిరుపతి (విద్య), ఆగస్టు 3, ప్రభాతవార్త**



ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం వారు తిరుపతి ఎంఆర్ పల్లిలోని రాస్ అంగన్‌వాడి కేంద్రంలో గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్ర రీసెర్చ్ అసోసియేట్ డా. కోన ప్రభ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి తల్లిపాల ప్రాముఖ్యత, ఆవశ్యకతను తెలియజేయడానికి, అవగాహనను పెంపొందించడానికి తల్లిపాల వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. తదుపరి పాల్గొన్న మహిళలకు తల్లిపాల ప్రాముఖ్యతపై కరపత్రాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలోమహిళా అధ్యయన కేంద్రం సిబ్బంది డాక్టర్ ఎం. ఇంద్రాణి, వి. ప్రీతి, పాలిచ్చే తల్లులు, గర్భిణీ స్త్రీలు, అంగన్వాడీ సిబ్బంది పద్మజ, యశోద పాల్గొన్నారు.

## 1915 మందికి జగనన్న తోడులో లబ్ది

**శ్రీకాళహస్తి,ఆగస్టు 3 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి పురపాలకసంఘ పరిధిలో జగనన్న తోడు పథకంలో 1915మందికి లబ్ది చేకూరిందని ఇన్‌చార్జి కమిషనర్ డి.వెంకటరమణ తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వర్చువల్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. ఈ సమావేశానికి ఇన్‌చార్జి కమిషనర్ వెంకటరమణ అధ్యక్షత వహించారు. శ్రీకాళహస్తి లో మూడవ విడత జగనన్న తోడు పథకంలో శ్రీకాళహస్తి లబ్దిదారులకు సహాయం అందించే పథకాన్ని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అభ్యర్థన మేరకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శ్రీకాళహస్తి లబ్దిదారులకు వర్చువల్ ద్వారా సహాయం అందించారని ఇన్‌చార్జి కమిషనర్ వివరించారు.శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలో 1915 మంది లబ్దిదారులకు రూ.ఒక కోటి 91 లక్షల 50వేల రూపాయలు రుణం ద్వారా లబ్దిపొందుతున్నారని వివరించారు. బ్యాంకుల్లో రుణం పొందిన వారు సక్రమంగా వాయిదాల మేరకు చెల్లించిన వారికి వడ్డీలు, వారి ఖాతాలకుజమ కావటం జరుగుతుందన్నారు. రుణం పొంది వాయిదాలు సక్రమంగా చెల్లిస్తున్న వారికి రూ.10 నుంచి 20వేల వరకు రుణం మంజూరుచేస్తారన్నారు. స్థానిక శాసనసభ్యుడు అందించిన తోపుడు బండ్లు పంపిణి ద్వారా తోడు లబ్దిదారులు చాలా లబ్ది పొందుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమాల్లో జగనన్న తోడు లబ్దిదారులు పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటరమణ, సిటీ మిషన్ మేనేజర్ ఎన్ ప్రసాద్, మెప్మా సిబ్బంది కావమ్మ, అమ్మాజి, అజీజ్ సచివాలయ, వెల్ఫేర్ కార్యదర్శులు,వాలంటీర్లు పాల్గొన్నారు.

## చటర్జీ నగర్ సమస్యలు పరిష్కరిస్తాం

**శ్రీకాళహస్తి రూరల్,ఆగస్టు 3 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి పంచాయతీ పరిధిలోని చటర్జీ నగర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని సర్పంచ్ నర్రా భార్గవి మోహన్ నాయుడుతెలిపారు. పంచాయతీ పరిధిలోని చటర్జీ నగర్‌లో సర్పంచ్, వైస్ సర్పంచ్‌లు పర్యటించారు. ఇక్కడ పారిశుద్యం, రోడ్లు సమస్య చోటు చేసుకుంది. 50 సంవత్సరాల నుంచి ఇక్కడ ఉన్నా కనీస వసతుల్లేక తిప్పలు పడుతున్నామని గ్రామస్తులు విన్నవించుకున్నారు. పర్యటనలో సర్పంచ్ బార్గవి మోహన్, వైస్ సర్పంచ్ రామచంద్రయ్య, వార్డు సభ్యుడు రమణయ్య, పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, మహిళా పోలీసు పాల్గొన్నారు.

## నరసింహులు కుటుంబానికి ఆర్థిక సాయం

**పుత్తూరురూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త:**



పుత్తూరు మండలం కృష్ణసముద్రం గ్రామానికి చెందిన నరసింహులు గత నెల 19న రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో బుధవారం రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని నరసింహులు కుమారుడి చదువుకు సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు దిలీప్, శ్యామ్, రాజేంద్ర, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెరుమాళ్ళపల్లిలో నూతన వధువరులకు పెళ్లి కానుక

**తిరుపతిరూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త:**



దేశంలో ఎక్కడా లేనివిధంగా చంద్రగిరి నియోజకవర్గంలో నూతన వధువరులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుకను అందిస్తున్నారని వై సి పి నాయకులు, పెరుమాళ్ళపల్లి మాజీ సర్పంచ్ పెద్దమంగారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో పెళ్లి చేసుకునే నూతన వధువరులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి పెళ్లి కానుక అందించడం శుభ పరిణామం అని పేర్కొన్నారు. పెరుమాళ్ళపల్లిలో పెళ్ళి కాబోయే నూతన వధువరులకు తాళి బొట్టు, పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## సాయినగర్‌లో నీటి దహార్తి తీరినట్లే

- రూ.52లక్షలతో తొమ్మిది మోటర్లు, పైపులైన్ పనులు - సాయినగర్‌లో గ్రామ సర్పంచ్ డి.వి.రమణ

**తిరుపతిరూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త:**



సాయినగర్ గ్రామ పంచాయతీలో శాశ్వతంగా నీటి దాహార్తి తీరనున్నదని గ్రామ సర్పంచ్ డి.వి.రమణ పేర్కొన్నారు. సాయినగర్ గ్రామ పంచాయతీలో రూ.52 లక్షలతో తొమ్మిది బోర్లు, మోటర్లు పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. జలజీవన్ మిషన్ నుండి రూ.31 లక్షలు, తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మంజూరు చేసిన రూ.15 లక్షలు సాయినగర్ గ్రామ పంచాయతీ నిధులు రూ.6లక్షలతో పనులు జరుగుతున్నట్లు తెలిపారు. పంచాయతీలో 9 బోర్లు వేయగా అందులో 8 బోర్లులో పుష్కలంగా నీళ్లు ఉన్నాయన్నారు. 15 రోజులలో బోర్లకు విద్యుత్ మోటర్లు బిగించి నీటి సరఫరా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యధర్శి రాజేష్, ఉప సర్పంచ్ సోమశేఖర్‌రెడ్డి, ఎంపిటిసిలు శ్రీరాములురెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## 5న సురుటుపల్లికి మంత్రి పెద్దిరెడ్డి రాక : ఎమ్మెల్యే ఆదిమూలం

**నారాయణవనం, ఆగస్టు 3 ప్రభాతవార్త :**



రాష్ట్ర విద్యుత్, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈనెల 5వతేది నాగలాపురం మండలంలోని సురుటుపల్లి ఆలయానికి వస్తారని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం విలేఖరులకు తెలిపారు. ఈనెల 5వతేది శుక్రవారం ఉదయం 9గంటలకు సురుటుపల్లి దేవస్థానం వద్ద కొత్తగా 50లక్షల వ్యయంతో నిర్మించిన అన్నదాన సత్రాన్ని ప్రారంభిస్తారని, అలాగే దాతల సాయంతో కొత్తగా ఏర్పాటు చేసిన ఎసిలను ప్రారంభిస్తారన్నారు. నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ద్రవిడ వర్సిటీలో మైనింగ్‌కు అధికారులకు సంబంధం లేదు

**- ద్రవిడ వర్సిటీ వి.సి. ఆచార్య తుమ్మల రామకృష్ణ - మైనింగ్ మాఫియా అని ప్రతిపక్ష నేత వ్యాఖ్యలు బాధాకరం**

**- వర్సిటీకి ఆర్థిక వనరులు తక్కువ..ఎవర్నీ ఉద్యోగాలనుంచి తొలగించడం లేదు !!**



కుప ్పం, ఆగస్టు 3ప్రభాతవార్త : ద్రవిడ వర్సిటీలో జరుగుతున్న గ్రానైట్ మైనింగ్‌కు వర్సిటీ అధికారులకు ఎలాంటి సంబంధం లేదని ద్రవిడ వర్సిటీ ఉపకులపతి ఆచార్య తుమ్మల రామకృష్ణ, రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వర్సిటీలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో ప్రభుత్వాల అనుమతులు పొందిన వారు క్వారీలు నడుపుకుంటే అందులో తమ ప్రమేయం ఉన్నట్లు పేర్కొనడం భావ్యం కాదన్నారు. అధికారుల సూచనల మేరకు క్వారీల చుట్టూ ట్రెంచ్‌లు ఏర్పాటుచేశామన్నారు. క్వారీలు నిర్వహించే 11మందిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసులు నమోదయ్యాయన్నారు.తాము ఎక్కడా అవినీతికి పాల్పడలేదన్నారు. వర్సిటీలో రిజిస్ట్రార్ మైనింగ్ మాఫియా నడుపుతున్నారని ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు పేర్కొనం బాధాకరమని రిజిస్ట్రార్ వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. తాను తప్పులకు పాల్పడినట్లు నిరూపిస్తే ఎలాంటి చర్యలకు అయినా సిద్ధమేనన్నారు.వర్సిటీ ప్రాంతంలో 1992నుంచి గ్రానైట్ లీజులు కొనసాగుతున్నాయన్నారు. వర్సిటీపరిధిలో ఆర్థిక వనరులు తక్కువగా ఉన్నాయన్నారు. తొలుతగా ప్రభుత్వం మంజూరు చేసిన పోస్టులకు జీతాలు కేటాయిస్తూ అనంతరం మిగతా వారికి చెల్లిస్తున్నామన్నారు. పలువురిని రెగ్యులర్ చేయాలని సైతం ప్రతిపాదనలు పంపామని అయితే ఉద్యోగుల రెగ్యులర్ విషయంలో ఇసి బోర్డు ఇక్కడ విద్యార్థుల సంఖ్య తక్కువ ఉద్యోగుల సంఖ్య ఎకు ్కవ అని పేర్కొంటోందన్నారు. అయితే వర్సిటీలో ఎవర్నీ ఉద్యోగాలనుంచి తొలగించలేదని అది తప్పుడు సమాచారం అన్నారు. గత నాలుగేళ్లకు సంబంధించిన నగదును ఇసి సమావేశంలో ఇవ్వమని తేల్చేశారని అలాగే వచ్చే ఏడాది వర్సిటీ సిల్వర్ జూబ్లీ కార్యక్రమాలకోసం కోటి రూపాయలు నిధులు కోరగా ఇసి బోర్డు అంగీకరించలేదని పేర్కొన్నారు. గత ంలో టిటిడి అందించే 50లక్షల సాయంసైతం నాలుగేళ్లుగా నిలిచిపోయిందన్నారు. రాష్ట్రంలో ఏ వర్సిటీకి లేని విధంగా ఎపి పిజి టెక్నో సెంటర్ ద్రవిడ వర్సిటీకి మాత్రమే ఉందన్నారు.

# గజ వాహనంపై శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజులస్వామి



పుత్తూరురూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలో వెలసిన శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి గజ వాహనంలో ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు .ఉదయం ఆలయంలోని స్వామివారికి, అమ్మవారికి వివిధ సుగంధ ద్రవ్యాలతో అలంకరణలు చేశారు. ఉదయం 9 గంటలకు ఉత్సవం, గాండీవ సందోహం రాజసుయాగం, ఉభయ దాతలుగా ఈశ్వరాపురం హరిజన సంఘం వారు వ్యవహరించారు. అలాగే రాత్రి మంగళవాయిద్యాల నడుమ విద్యుత్ దీపాలతో గజ వాహనంపై స్వామివారిని అమ్మవారిని ఊరేగించారు. ఉభయదాతగా ఆర్యవైశ్య సంఘం వారు నిర్వహించారు. ఆలయ ఆవరణలో మహాభారత హరికథ కార్యక్రమానికి గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. సాయంత్రం గెరిగె ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లారీ మోహన్, మాజీ చైర్మన్ సాల్వాకం ఏళుమలై మొదలియార్, పాలక మండలి సభ్యులు డి.ముకుంద ప్రకాష్, ఎం.సెల్వరాజ్‌పిళ్లై, పి.మునిరాజ, కె.లక్ష్మిసుధ, కె.నిర్మల, వి.మహాదేవి, ఆలయ పూజారి సి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**నేడు ఆలయంలో....**

శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజస్వామి తిరుణాల సందర్భంగా గురువారం ఉదయం స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక విశేష అలంకరణలు, 9 గంటలకు ఉత్సవం, సాయంత్రం 4 గంటలకు సైంధవ రథోత్సవం, 6 గంటలకు తవణం పల్లకి ఉత్సవం, రాత్రి 7 గంటలకు హంస వాహనంపై ఊరేగింపు, 9 గంటలకు సింహ వాహనంపై ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ లారీ మోహన్ తెలిపారు.

# పూలే విధానాలతో ముందుకు సాగుదాం!

**రాజకీయాల్లో బిసి తుఫాన్ సృష్టిద్దాం..రాష్ట్ర అధ్యక్షులు**



తిరుపతినగరం, ఆగస్టు 3 ప్రభాతవార్త : మహాత్మా జ్యోతి రావుపూలే అంబేదనకర్ ఆశయాలతో ముందుకు సాగుతూ రాజకీయాల్లో బిసిల తుఫాను సృష్టించేందుకు సన్నద్ధం కావాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు పిలుపునిచ్చారు. బుధవారం తిరుపతి పెదకాపులే అవుట్‌లోని శ్రీలక్ష్మి శ్రీనివాస గ్రాండ్ హోటల్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం రాయలసీమ ప్రధాన కార్యదర్శి ఎం.రఘుపతి అధ్యక్షతన నూతన జిల్లా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షుడుగా నాగరాజు గౌడ్‌ను ఎన్నుకున్నారు. సభలో శంకరరావు మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికలకు ముందు బిసిలకు జపం చేస్తాయని ఓట్లు వేసుకున్న అనంతరం విస్మరిస్తారన్నారు. స్థానిక సంస్థల చట్టసభల్లో రిజర్వేషన్లు అమలు జరిగినపుడే బిసిలకు న్యాయం జరుగుతుందనానరు. ప్రగతి సాధించాలన్నా, మన ఆలోచనా విధానాల్లో మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరారు. త్వరలో రాజకీయ పార్టీని స్థాపించే విధంగా రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అడుగులు వేస్తుందని ఇందుకు ప్రతి ఒక్కరు సిద్దంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జ్ఞానజగదీష్, వాసుయాదవ్, గోపిగౌడ్, బుసనాగరాజు, ఎస్వీయూనివర్సిటీ నారాయణగౌడ్, మురళీ, కిరణ్, మధు ఆచారి, తులసిరామ్, ఉమాపతి ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి హయాంలోనే నగరి అభివృద్ధి : గాలి భానుప్రకాష్



విజయపురం, ఆగస్టు 3 ప్రభాతవార్త : నగరి నియోజకవర్గం పరిధిలోని గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ హయాంలో తన తండ్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు నేతృత్వంలో జరిగిన అభివృద్ధి తప్ప వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో అభివృద్ధి జాడలు కనిపించడం లేదని టిడిపి నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్ అన్నారు. బుధవారం విజయపురం మండలంలోని మల్లారెడ్డికండ్రిగ గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన తండ్రి ముద్దుకృష్ణమనాయుడు స్థానిక ఎస్టీ కాలనీలో రూ. 48 లక్షలతో రోడ్డు నిర్మించిన విషయాన్ని స్థానికులు గుర్తు చేసుకున్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఏ మూలకు వెళ్లినా ముద్దన్న చేసిన అభివృద్ధి కనపడుతోందని స్థానికులు తన తండ్రి కోసం చెబుతున్నారని తెలిపారు. వైసిపి పాలనలో ప్రజలపై పన్నుల రూపేణా బాదుడే బాదుడు తప్ప అభివృద్ధి జరగలేదన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబు యాదవ్, చిత్తూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి మణిరాజు, మండల మాజీ అధ్యక్షుడు దశరధరాజు, మాజీ సర్పంచ్ నాగయ్య, ఇంకా నాయకులు బాలకృష్ణ, నాథముని, నాగరాజు, గోపి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీరేణుకామాత బ్రహ్మోత్సవాలు ప్రారంభం



రేణిగుంట ఆగస్టు 3 ప్రభాతవార్త : రేణిగుంట మండలం దిగువమల్లవరం అరుంధతీవాడలో కొలువుతీరిన శ్రీశ్రీశ్రీరేణుకామాత 60వవార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీగణపతిపూజతో బ్రహ్మోత్సవ వేడుకలకు అంకురార్పరణ జరిగింది. కాపుకట్టుట, గరిగెపూజ, శూలాల ఊరేగింపు అంగరంగవైభవంగా జరిగింది. అనంతరం అమ్మవారికి భక్తులు అంబళ్ళు సమర్పించి తమభక్తిప్రపత్తులను చాటుకున్నారు. గరిగె ఊరేగింపు 5గ్రామాల్లో జరిగింది. పుట్టవద్ద కథతో మొదటిరోజు కార్యక్రమం పూర్తయింది. నిర్వహక ప్రతినిధి మర్దాలరవిబాబు, నిర్వహణ కమిటీసభ్యులు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

# నీలకంఠుని ఆలయ మహాకుంభాభిషేకం నిర్వహిస్తాం

**-చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు**

శ్రీకాళహస్తి రూరల్,ఆగస్టు 3 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో వెలసిన నీలకంఠేశ్వరస్వామి ఆలయ మహాకుంభాభిషేకంను నిర్వహిస్తామని శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వివరించారు. బుధవారం గ్రామంలోని అన్నపూర్ణా సమేత నీలకంఠేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు.ఈ నెల 7 నుంచి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారులతో



కలసి ఏర్పాట్లును పర్యవేక్షించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి గ్రామస్తులతో చర్చించారు.ఈ ఆలయానికి 33 సంవత్సరాల ముందు ఆలయ నిర్మించి కుంభాభిషేకం నిర్వహించారని తరువాత పట్టించుకోలేదని చైర్మెన్ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, అనుబంధ ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు జయశ్యాంరాయల్, మున్నారాయల్, గ్రామ పెద్దలు నీలకంఠారెడ్డి, రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రంగయ్య, సంజీవయ్య, మురుగ,రమణ,మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

7నుంచి ఉత్సవాలు:

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ఊరందూరులోని నీలకంఠేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబందించి ఆలయాధికారి వికె సాగర్‌బాబు వివరాలను ప్రకటించారు. ఈ నెల 7న అంకురార్పణం, ధ్వజారోహణం,8న సూర్యప్రభవాహనం 9న చంద్రప్రభవాహనం 10న చిలువక వాహనం, 11న నంది వాహనం 12న రథోత్సవం,13నకళ్యాణోత్సవం,14న పార్వేట ఉత్సవం 15న తీర్థవారి ధ్వజావరోహణం,16న పల్లకి సేవ, 17న శాంతి అభిషేకాలు నిర్వహించబడుతుందని వివరించారు.

# ఎన్టీఆర్ కుటుంబంపై దుష్ప్రచారం తగదు

**-తెలుగుదేశంపార్టీ శ్రేణుల నిరసన**



గూడూరు,ఆగస్టు 3 ప్రభాతవార్త : మాజీ ముఖ్యమంత్రి,తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు ఎన్టీ.రామారావు కుటుంబంపై వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ విషప్రచారానికి దిగడం సరికాదని తెలుగుయువత, తెలుగు మహిళ, తెలుగు విద్యార్థి సంఘాలు నాయకులు పేర్కొన్నారు.గూడూరు పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం ముందు వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి చిత్రపటానికి చెప్పుల దండలు వేసి నిరసన వ్యక్తం చేశారు.విజయసాయిరెడ్డి ఎన్టీఆర్ కుటుంభాన్ని కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టడం సరికాదన్నారు.గతంలో తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు పింక్ డైమండ్ విషయంలో, 35మంది డిఎస్పీల ప్రమోషన్ల విషయంలో, కోడికత్తి విషయంలో,జగన్‌మోహన్‌రెడ్డి చిన్నాన హత్య విషయంలో ఇలాంటి దుష్ప్రచారాలు చేసి నోటికి వాతలు పెట్టుకున్నారరని ఆరోపించారు. ఇప్పుడు నారా లోకేష్‌పై అసత్య ప్రచారాలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్న విజయ సాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.విజయసాయిరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని ఆయనపై చర్యలు తీసుకోవాలని ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి రవినాయుడు,రాష్ట్ర మహిళ కార్యదర్శి గుండాల లీలావతి,పార్లమెంటు తెలు గు మహిళ అధ్యక్షురాలు చక్రాల ఉష,తిరుపతి పార్లమెంటు యువత ప్రధాన కార్యదర్శి ప్రణీత్ యాదవ్, తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి శ్రావణి,విద్యార్థి సంఘం నాయకులు వెంకటేష్‌లు పాల్గొన్నారు.

# నేడు కాణిపాకంలో నూతన ధ్వజస్థంభం ప్రతిష్ఠ

కాణిపాకం, ఆగస్టు 3 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న నూతన ధ్వజస్థంభం ప్రతిష్ఠ గురువారం ఉదయం నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఎంవి.సురేష్‌బాబులు తెలిపారు. కాణిపాకం ఆలయంలో పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా సుమారు 10 కోట్లు రూపాయల వ్యయ అంచనాలతో ప్రవాస భారతీయుడైన విజయవాడకు చెందిన ఐకా రవి అనే దాత సహకారంతో ఆలయ పునర్నిర్మాణ, విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్న విషయం విధితమే. ఇందులో భాగంగా నూతన బంగారు ధ్వజస్థంభంను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం గత కొద్ది రోజుల క్రితం ఆంధ్ర-ఒడిస్సా సరిహద్దులోని చింతూరు అటవీ ప్రాంతం నుండి సుమారు 53 అడుగుల పొడవు గల రెండు టేకు కొయ్యలను తీసుకువచ్చి నూతన ధ్వజస్థంభం నిర్మాణ పనులు, రాగి రేకుల తాపడం పనులు పూర్తి చేసి ప్రతిష్టకు సిద్ధం చేశారు. ఈమేరకు గురువారం ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు ధ్వజస్థంభం ప్రతిష్ట పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈసందర్భంగా ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు భక్తులకు దర్శనం పూర్తిగా నిలిపివేయనున్నట్లు ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ సురేష్‌బాబులు తెలిపారు.

# అమ్మవారికి బంగారు కాసుల హారం వితరణ



తిరుచానూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారికి బుధవారం అమరజ్యోతి కళ్యాణమండపం అధినేత బలరాం నాయుడు దంపతులు 230 గ్రాముల బంగారు కాసుల హారం ను కానుకగా అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, సూపరెన్‌టెండెంట్ మధుసూధన్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు ప్రసాద్, దాము, అర్చకులు బాబుస్వామి తదితరులు పాల్గొన్నారు.

# నగర పాలక స్టాండింగ్ కమిటీ జరగబోవు సమావేశంపై సమీక్ష



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 3 ప్రభాతవార్త: తిరుపతి నగర అభివృద్ధి పనులకు నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ జరగబోయే సమావేశంపై బుధవారం ఉదయం తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. తిరుపతి నగర పాలక సంస్థ పరిధి లోని అభివృద్ధికి కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని నగర మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. వివేకానంద సమీపంలోని రాఘవేంద్రనగర్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. పోస్టల్ కాలనీ, శ్రీనివాసపురం వద్ద రోడ్డు మరియు డ్రైనేజీ నిర్మాణాన్ని చేపట్టడం కొరకు, తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని పిఎల్ఆర్ కన్వెన్షన్ హాల్ దగ్గర దెబ్బతిన్న రోడ్డును పునర్మిణాల కొరకు, నగరంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు, నగర పాలక పరిధిలోని అభివృద్ధి పనులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమవేశంలో అదనపు కమిషనర్ సునీత, ఉపకమిషనర్ చంద్రమైలీ శ్వరరెడ్డి, ఎస్ఇ మోహన్, నగర పాలక కార్యదర్శి రాధికరెడ్డి, ఎంఇ వెంకట్రామ్‌రెడ్డి, ఎంహెచ్ఓ హరికృష్ణ, ఆర్ఓ సేతమాధవ్, మేనేజర్ చిట్టిబాబు, ఎసిపి షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

# చినుకు పడితే చిత్తడే

**- నోర్లు బాదుకొంటున్న వనదుర్గాపురం ప్రజలు**



పాలసముద్రం, ఆగస్టు 3 ప్రభాతవార్త: చినుకు పడితే తమ ప్రాణాలపై నమ్మకం లేని పరిస్థితి నెలకొందని పాలసముద్రం మండలం వనదుర్గాపురం ప్రజలు నోర్లు బాదుకొంటున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాలసముద్రం మండలం వనదుర్గాపురం, అత్తిమంజేరిపేట మార్గమధ్యలో వున్న వనదుర్గాపురం తారు రోడ్డు చిందర వందరగా మారింది. ఈ సమస్య గత కొన్నేళ్ళుగా వున్నప్పటికీ అధికారులు, నాయకులు ఎవ్వరు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొద్ది పాటి వర్షం కురిస్తే రోడ్లపై వున్న గుంతలు నిండి రహదారి కన్పించకుండా పోవడంతో వాహనదారులు గుంతల్లోకి వాహనాలతో వెళ్ళి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డును వేసి 20 సంవత్సరాలు దాటుతున్నా మళ్ళీ రోడ్డు వెయ్యడానికి ఎవ్వరు ముందుకు రావడం లేదన్నారు. ఈ రోడ్డు సమస్యను పరిష్కరించాలని పలుమార్లు మండల స్థాయి అధికారులను కలిసి అర్జీలు ఇచ్చిన పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

# ఘనంగా శ్రీ కనకనాశమ్మ జాతర..

**ఎమ్మెల్సీచే పట్టువస్త్రాల సమర్పణ**



కుప్పంరూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త : కుప్పం మండలం తమిళనాడు సరిహద్దుల్లోని పెద్దవంక శ్రీ కనకనాశమ్మ ఆలయంలో బుధవారం అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆహ్లాదకర అటవీ ప్రాంతంలో పాలారు నది ఒడ్డున ఈ ఆలయంకు ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పోటెత్తారు. తమిళనాడు రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి ఆడి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా అమ్మవారికి చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్ పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు. అమ్మవారిని మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, పాలారు నది చెక్‌డ్యామ్‌పైనుంచే ఆలయంవరకు దారి సౌకర్యం ఉండడంతో పాటు చెక్‌డ్యామ్ నిండి నీరు కిందకు ప్రవహిస్తున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు, పోలీసులు గట్టి చర్యలు చేపట్టారు.

# బిజెపి యువ సంఘర్షణ యాత్ర



బంగారుపాళ్యం, ఆగస్టు 3 ప్రభాతవార్త: భారతీయ జనతా పార్టీ యువమోర్చా ఆధ్వర్యంలో తలపెట్టిన యువ సంఘర్షణ యాత్ర బుధవారం బంగారుపాళ్యంలో నిర్వహించారు. ఈ యాత్ర మంగళవారం తిరుపతిలో ప్రారంభం కాగా బుధవారం పలమనేరుకు వెళ్తూ బంగారుపాళ్యంలో యాత్రను కొనసాగిం చారు. వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం యువతకు చేస్తున్న అన్యాయానికి నిరసనగా పార్టీ పరంగా యాత్రను చేపట్టామని జిల్లా బిజెపి కార్యదర్శి భానుప్రకాష్ తెలిపారు. ఎలాంటి ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా యువతను నిరుద్యోగులుగానే వుంచుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శరత్‌బాబు, లోకనాథం, హరిప్రసాద్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తపాలా కార్యాలయాల్లో జెండాలు విక్రయం

కోట,ఆగస్టు 3 ప్రభాతవార్త : జిల్లాల్లోని ప్రధాన తపాలా కార్యాలయాలు,సబ్ పోస్టాఫీసుల్లో ఈనెల 1 నుంచి రూ.25 చొప్పున జాతీయ జెండాలను విక్రయిస్తున్నారు. మాతృ దేశ భక్తి, గౌవరానికి ప్రతీకగా త్రివర్ణ పతాకాలను స్థానికులు ఇష్ట పూర్వకంగా కొనుగోలు చేస్తున్నారు. ఈ ఫోర్టల్, ఆన్‌లైన్ ద్వారా రుసం చెల్లించిన తర్వాత సమీపంలోని తపాలా కార్యాలయాలకు వద్దకు వెళ్లితే అక్కడ వాటిని సిబ్బంది అందచేస్తారని ఇక్కడ విద్యానగర్ పోస్టాఫీస్ ఉద్యోగులు తెలిపారు.గ్రామీణ ప్రాంతాల ప్రజలు కు అందుబాటులో ఈజెండాలు ఉంటాయన్నారు.75 వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతి ఇంటిపై మూడు రంగుల పతకాలు రెపరెపలాడే విధంగా ఉన్నతాధికారులు పిలుపు ఇవ్వడంతో పాటు కార్యచరణ కోసం ఇక్కడ ఉద్యోగులు శ్రమిస్తున్నారు.రెండు అడుగులు పొడవు. 1.50 అడుగులు వెడల్పు కలిగిన నూలుతో తయారైన జాతీయ జెండాలు ఆకర్షణీయంగా ఉన్నాయి.

# తిరుపతి ఐఐటీ, ఐఐఎస్ఈఆర్ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి : ఎంపి

తిరుపతి (విద్య), ఆగస్టు 3 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన వల్ల అనేక కేంద్ర ప్రభుత్వ సంస్థలను కోల్పోయామని తత్ఫలితంగా రాష్ట్రంపై ప్రతికూల ప్రభావం పడిందని కోల్పోయిన వాటిలో కేంద్ర విద్యా సంస్థలు కూడా ఉన్నాయని పరిహార చర్యగా ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 ప్రకారం ఉచిత విద్య కోసం రాష్ట్రంలో కేంద్ర విద్యా సంస్థల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం హామీ ఇవ్వబడిందని చెప్పారు. అయితే తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్) అనే రెండు ప్రముఖ సంస్థలు ఇప్పటికే తాత్కాలిక క్యాంపస్‌ల నుంచే పని చేస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర విభజన జరిగిన ఎనిమిదేళ్ల తర్వాత కూడా శాశ్వత క్యాంపస్, మౌళిక సదుపాయాల కొరత ఈ ఇన్‌స్టిట్యూట్‌ల అభివృద్ధికి ఆటంకంగా ఉందన్నారు. తిరుపతిలో ఐఐటీ, ఐఐఎస్ఈఆర్ యొక్క వేగవంతమైన అభివృద్ధికి అవసరమైన అన్ని ఆర్థిక, ఆర్థికేతర సహాయ, సహకారాలను అందించాలని గౌరవ సభ ద్వారా కేంద్ర విద్యా శాఖ మంత్రికి తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి విన్నవించారు.

# ఫిన్‌కేర్ కేసులో మరో 30గ్రాములు బంగారు స్వాధీనం



శ్రీకాళహస్తి, ఆగస్టు 3 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణంలోని పెద్దమసీదువీధిలో నడుబడుతున్న ఫిన్‌కేర్ స్మాల్‌ఫైనాన్స్ కంపెనీలో మే 26రాత్రి జరిగిన చోరీ సంఘటనలో మరో 30 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ అంజూయాదవ్ బుధవారం తెలిపారు. ఈకేసుకు సంబందించి ఇంకా 80గ్రాముల బంగారు లెక్కతేలాల్సి ఉందని ఆమె వివరించారు. ఈకేసుకు సంబందించి బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒక కిలో 30గ్రాముల బంగారు స్వాదీనం చేసుకున్నట్లు ఆమె వివరించారు. బుధవారం స్వాధీనం చేసుకున్న బంగారు బజాజ్‌మినీ ఫైనాన్స్ నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్కడి మేనేజర్ రాజశేఖర్ దేవకుమార్ పేరుతో బంగారాన్ని తాకట్టుపెట్టినట్లు రికార్డులు సృష్టించుకున్నారని అయితే గతంలో తాము రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకున్నపుడు ఈవాస్తవాలు వెల్లడికాలేదని సిఐ అంజూయాదవ్ ఓప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తమ విచారణలో ఈవాస్తవం వెల్లడికావడంతో బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆమె వివరించారు. ఫిన్‌కేర్ కేసుకు సంబందించి ఇంకా 80గ్రాముల బంగారు లెక్కతేలాల్సి ఉందని ఇదికూడా త్వరలోనే చేధిస్తామని ఆమె వివరించారు.

# సింహవాహనంపై భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రుడు సాక్షాత్కారం



నారాయణవనం, ఆగస్టు 3 ప్రభాతవార్త : మండలకేంద్రంలోని నారాయణవనం పంచాయతీ సముదాయం రోడ్డులో వెలసిన టిటిడి అనుబంధ ఆలయం భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవరోజు బుధవారం రాత్రి సింహవాహనంపై ఊరేగారు. గ్రామవీధుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. అంతకుముందు ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవారికి స్నపనతిరుమంజనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అలాగే శుద్ధి, నిత్య కైంకర్య పూజా కార్యక్రమాలను నిర్వహించిన తర్వాత అభిషేకం, స్వామి, అమ్మవారిని పుష్పాలతో సుమనోహరంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, పూజారి అయ్యప్ప, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.